Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం, మే 28, 2026 | సంపుటి - 20 | సంచిక 249 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

కల్లాల్లో తడిసిన ధాన్యంతో
## రైతుల ఆందోళన

- తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేయాలని డిమాండ్
- అకాల వర్షంతో చల్లబడ్డ వాతావరణం
- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలుల వర్షం



హైదరాబాద్ : భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు భారీ వర్షంఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలకు మాత్రం కన్నీరు మిగిల్చింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.

2లో

పలు జిల్లాలకు
# ఆరెంజ్ అలర్ట్ జారీ

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలన్న రేవంత్



హైదరాబాద్ : వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు.

తరువాయి 2లో

త్వరలో ఇందిరమ్మ
# ఇళ్ల పంపిణీ కార్యక్రమం

ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి

- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి



**రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు.**

హైదరాబాద్ : తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది.

తరువాయి 2లో

## కర్నాటకలో మారుతున్న సమీకరణాలు



2

- సిద్ధరామయ్యను తప్పుకోవాలని అధిష్టానం సూచన
- నేడు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సమాచారం
- 30న డికె శివకుమార్ ప్రమాణం చేస్తారన్న ప్రచారం
- సిద్ధరామయ్యను రాజ్యసభకు పపింపాలని అధిష్టానం నిర్ణయం



ప్రధాని మోడీతో తమిళనాడు
## సిఎం విజయ్ భేటీ

రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రధానికి సిఎం వినతి

పలు అంశాలపై ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ : తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసు కున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీలో పలు అంశాలు చర్చించారని సమాచారం. తొలుత ఢిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. తమిళనాడుకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు అంశాలు



డిజిటల్ చెల్లింపుల్లో
## జాగ్రత్త

ప్రజలను హెచ్చరించిన సిపి సజ్జన్నార్

హైదరాబాద్ : బక్రీద్ పండుగ నేపథ్యంలో.. డిజిటల్ చెల్లింపుల విషయంలో వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఇటీవల కాంచన్‌బాగ్, రాజేంద్రనగర్ పీఎస్‌ల పరిధుల్లో

2లో

కల్లాల వద్ద
## దైన్యంగా రైతులు

పంటల కొనుగోలు లేక దీనావస్థ

వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి

బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి

పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు



హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు.

2లో



సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు
# తెలుగుదేశం నాంది

- టిడిపి పుట్టుక, ప్రయాణం ప్రస్థానం అన్నీ అద్భుతాలే
- దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ టిడిపి
- మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తాం
- 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం
- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు
- మహానాడు మోడల్ మారింది తప్ప..విధానం మారలే
- వైసిపి హయాంలో అణచివేతలను ఎదుర్కొని నిలబడ్డాం
- మహానాడు ప్రారంభోపన్యాసంలో టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి : విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం పార్టీ నాంది అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్థానం అన్ని అద్భుతాలేనని... ప్రతి అడుగు సంచలనమేనని పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. 1875 క్లస్టర్ల వేదికగా ఈసారి మహానాడు జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. లక్షలాదిమంది కార్యకర్తలు తొలిరోజే అదరగొట్టారని ప్రశంసించారు. పశ్చిమాసియా యుద్ధవాతావరణం మూలంగా మహానాడును వర్చువల్‌గా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. 'సమాజమే దేవాలయం – ప్రజలే దేవుళ్లు' అని 44 ఏళ్ల క్రితం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని వ్యాఖ్యానించారు.

తరువాయి 2లో

దేశంలో 25శాతం
## పెట్టుబడులు ఏపికే

రాజకీయాల్లో యువతకు పెద్దపీట వేస్తాం

విశాఖ మహానాడు వేదికలో ఎంపి శ్రీభరత్

విశాఖపట్నం : దేశంలో గత ఏడాది వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే వచ్చాయని విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. భరత్ వెల్లడించారు. స్పీడ్ ఆఫ్ డ్యూయింగ్ బిజినెస్ నినాదంతో సక్సెస్ అయ్యామన్నారు. బుధవారం విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలోని 42, 43వ వార్డుల

2లో

గొడ్డలి పార్టీ కుట్రలను
## ఎప్పుడు గమనిస్తుండాలి



- సొంత తల్లిని, చెల్లిని మెడపెట్టి గెంటేసిన చరిత్ర వారిది
- డీఎస్సీని అడ్డుకోవాలని వైసీపీ నేతలు చూశారు
- పదో తరగతి పేపర్ లీక్ చరిత్ర వారిదని మరచిపోవద్దు
- మహానాడులో వైసిపి తీరును ఎండగట్టిన లోకేశ్

అమరావతి : గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పుడు గమనిస్తూ ఉండాలని.. జగన్ అండ్ కో డీఎస్సీపై చేసే కుట్రలను తిప్పి కొట్టాలని తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత తల్లిని, చెల్లిని మెడపెట్టి గెంటేశారని ధ్వజమెత్తారు. జగన్ బాబాయి, మాజీ మంత్రి వివేకానంద రెడ్డిని గొడ్డలితోనే కదా చంపారు...

తరువాయి 2లో

# కల్లాల్లో తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన

అకాల వర్షాలకు పలు కొనుగోలు కేంద్లా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది.సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబానగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ., నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వడ్లు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

# దేశంలో 25శాతం పెట్టుబడులు ఏపికే

క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీ శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ.. 20, 25 ఏళ్ల లోపు యువతకు పబ్లిక్ పాలసీ, రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళా బిల్లు చట్టం అమలులోకి రావడం ఖాయమన్నారు. పార్టీలోకి పెద్ద ఎత్తున మహిళా శ్రేణులను తెలుగుదేశం పార్టీ ఆహ్వానిస్తోందని తెలిపారు. టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించటం శుభసూచకమని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరింత బలంగా ముందుకు వెళ్లనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 82 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లస్టర్‌లో మహానాడు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోసం ప్రత్యేకంగా భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా1,850 క్లస్టర్లలో మహానాడు సమావేశాల నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలోని 81 క్లస్టర్లలో వర్చువల్‌గా నిర్వహించిన మహానాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రధాని మోడీతో తమిళనాడు సిఎం విజయ్ భేటీ

చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్థించినట్లు పేర్కొంది. అనంతరం ఆయన నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం. విజయ్ తన పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా కలుసుకోనున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలను 10 జన్‌పథ్‌లో కలుసుకోనున్నారు. విజయ్ సమావేశం నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల రాహుల్-విజయ్ ఫోస్టర్లు వెలిసాయి. కాగా, వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీల నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో విజయ్‌ను కలుసుకోనున్నారు.

# పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# రైతుల ఆగ్రహంలో కాంగ్రెస్ కొట్టుకుపోతుంది

**మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శలు**

వనపర్తి,మే27 : రైతులకు దుర్భర పరిస్థితులు కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం మట్టికొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ శ్రేణులతో కలసి జిల్లాలోని పెద్దమందడి మండలంలో పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలమవడం రేవంత్ రెడ్డి చేతగానితనం, నిర్లక్ష్యమేనని ఆరోపించారు.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు తెలుగుదేశం నాంది

సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనను టీడీపీ పరిచయం చేసిందని ప్రస్తావించారు. జెండర్ ఈ క్వాలిటీ, సామాజిక సమస్యలపై తెలుగుదేశం పోరాడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయనమాట్లాడారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు. కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాం. మహిళల వంటింటి కష్టాలు తగ్గేందుకు నాడు గ్యాస్ కనెక్షన్ ఉచితంగా ఇచ్చాం. నేడు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నాం. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించాం. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నాం. సోషల్ సైకోల తాటతీసి. మహిళల గౌరవాన్ని కాపాడుతాం. నాడు ఒక్క ఐటీనే.. యువత తల రాత మార్చింది. తలసరి ఆదాయం, జీవన ప్రమాణాలు పెరిగాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు వంటివన్నీ రాష్ట్రానికి వస్తున్నాయి. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని చెప్పాం. ఎంవోయూలన్నీ పూర్తయితే ఇది సాధ్యమే. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడాం. ఇప్పుడు గేర్ మార్చాం.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై మాట్లాడుతున్నాం. ఏ ప్రాజెక్టు వచ్చినా మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తున్నాం. 288 ప్రాజెక్టులు ప్రారంభించే రోజు కూడా నిర్ణయించేశాం అని సీఎం తెలిపారు. వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ... కార్యకర్తల్లో జోరు మాత్రం తగ్గలేదని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. యుద్ధం వల్ల మహానాడును హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని వివరించారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప.. మహానాడు విధానం మారలేదని అన్నారు. భవిష్యత్తు గురించి అన్ని విషయాలు చర్చించుకుందామని తెలిపారు. కూడు, గూడు, నీడ లాంటి సంక్షేమ విధానాలతో టీడీపీ ఆవిర్భవించిందని ప్రస్తావించారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి గౌరవం, ఆత్మవిశ్వాసమని ఉద్ఘాటించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, భరోసా కలుగుతోందని తెలిపారు. నాటికి, నేటికి టీడీపీపై ప్రజలకు ఆదరణ చెక్కు చెదరలేదని చెప్పారు. 45 ఏళ్లుగా ప్రజాసమస్యల కోసం టీడీపీ నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా టీడీపీ నేతలు, కార్యకర్తలు ప్రజా పోరాటాలు ఆపలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'వైసీపీ హయాంలో నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగుదేశం జెండాను వీడలేదు. చంద్రయ్య లాంటి కార్యకర్తను నరుకుతున్నా.. జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారు. ఆయన స్ఫూర్తి కలకాలం నిలుస్తోంది. అక్రమంగా నన్ను జైల్లో పెట్టారు, లోకేశ్ యువగళాన్ని అడ్డుకున్నారు. మన నేతలను అరెస్టు చేశారు. బాధితులనే నిందితులుగా చేశారు. అయినా టీడీపీ వెనకడుగు వేయలేదు. ప్రజాస్వామ్యం కోసం టీడీపీ నిలిచిందని అంటూ వివరించారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నాం. ప్రజలు ఆదరించి, ఆశీర్వదించి రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత అప్పగించారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నాం. మహిళా సాధికారిత, సామాజిక, ఆర్థిక రాజకీయ గౌరవం కోసం టీడీపీ పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి.. నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక ఉంటుంది. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చాం. ఇది చూసే నా చిన్నప్పుడు ఇష్టంగా నడిపిన రాయల్ ఎన్‌ఫీల్డ్ కూడా రాష్ట్రానికి వచ్చింది. 1875 ప్రాంతాల్లో మహానాడు హైబ్రిడ్ సమావేశం జరుగుతోంది. ఏ తీర్మానానికి ఎంతమంది ఆమోదం తెలిపారో రియల్ టైంలో వస్తున్నాయి. బెస్ట్ టెక్నాలజీ ఫ్లస్‌ని ఇక్కడికి తెస్తామని యువతకు విజ్ఞప్తి చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకో వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# కర్నాటకలో మారుతున్న సమీకరణాలు

న్యూఢిల్లీ : కర్నాటకం క్లైమాక్స్‌కు చేరినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ అధిష్ఠానం చురుగ్గా పావులు కదుపుతోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉపముఖ్యమంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. 'గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే' అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో కీలకమైన బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఆయన గురువారం ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. కాగా, ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్తారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగే బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది.కర్ణాటకలో నాయకత్వ మార్పిడి సజావుగా పూర్తి చేసేందుకు కేంద్ర నాయకత్వం గట్టి కసరత్తే చేస్తోంది. ఇందులో భాగంగా సీఎం సిద్ధరామయ్య సేవలను కేంద్ర స్థాయిలో ఉపయోగించు కునేందుకు వీలుగా ఆయనను రాజ్యసభకు పంపాలని పట్టుదలగా ఉంది. అయితే ఆలోచించుకునేందుకు తనకు కొంత సమయం ఇవ్వాలని సిద్ధరామయ్య కోరినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. డీకే శివకుమార్‌కు సీఎం పగ్గాలు అప్పగించాలని కేంద్ర నాయకత్వం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడంతో సిద్ధరామయ్య ఎప్పుడు రాజీనామా చేస్తారు? డీకే ఎప్పటిలోగా ప్రమాణస్వీకారం చేస్తారనే అంశాలు ఆసక్తిరకంగా మారాయి. ఇందులో రెండు ఆప్షన్లు ఉన్నట్టు చెబుతున్నారు. ఒక ఆప్షన్ ప్రకారం ఈనెల 28న కానీ 29న కానీ సిద్ధరామయ్య తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేసే అవకాశం ఉంది. అదే జరిగితే ఈవారం చివర్లో 30వ తేదీ డీకే కొత్త సీఎంగా ప్రమాణస్వీకారం చేయవచ్చు. రెండో ఆప్షన్ ప్రకారం సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకునే విషయంలో జాప్యం తలెత్తవచ్చు. అదే జరిగితే జూన్ 18న రాజ్యసభ ఎన్నికలు జరిగిన తర్వాతే సిద్ధరామయ్య రాజీనామా చేయడం, డీకే శివకుమార్ సీఎం పగ్గాలు చేపట్టడం జరుగుతుంది. ఇకపోతే కర్ణాటక నుంచి 4 రాజ్యసభ సీట్లకు ఎన్నికల జరగాల్సి ఉండగా, సంఖ్యాబలం ఆధారంగా 3 సీట్లను కాంగ్రెస్ సునాయాసంగా గెలుచుకుంటుంది. సిద్ధరామయ్యకు ఒక రాజ్యసభ సీటును కాంగ్రెస్ అదిష్ఠానం ఇప్పటికే ఆఫర్ ఇచ్చింది. రెండో సీటులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పోటీ చేసే అవకాశం ఉంది. ఖర్గే ప్రస్తుతం కర్ణాటక నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఆయన పదవీకాలం త్వరలో ముగియనుంది. కాగా, మూడో రాజ్యసభ సీటు డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేశ్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. కాగా, కొత్త మంత్రివర్గంలో కనీసం ముగ్గురు డిప్యూటీ సీఎంలు ఉండాలని, తద్వారా 'పవర్ బ్యాలెన్స్'కు వీలుంటుందని సిద్ధరామయ్య వర్గం ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది. డీకే శివకుమార్ చేతిలో ప్రస్తుతం ఉన్న కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్ష పదవిని కూడా ఆ వర్గం కోరుతున్నట్టు చెబుతున్నారు.

# గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పుడు గమనిస్తుండాలి

అందుకే వైసీపీని గొడ్డలి పార్టీ అని పిలుస్తున్నామని విమర్శించారు. గత మహానాడులో 6 శాసనాలు ప్రవేశపెట్టామని.... వీటిని మనం ఎప్పుడు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మహానాడు వేడుకల్లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీని అడ్డుకోవాలని వైసీపీ నేతలు చూశారని ధ్వజమెత్తారు. 'నీది పదోతగరతి పేపర్ లీక్ చేసిన చరిత్ర.. నాది స్టాన్‌ఫర్డ్‌లో చదివిన చరిత్ర. బోత్ ఆర్ నాట్ సేమ్ బ్రదర్ సైకో. టీచర్లను మేము సింగపూర్ పంపిస్తే.. నువ్వు మద్యం షాపుల ముందు కాపలా పెట్టావ్' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం గడపదాటే లోపల అబద్ధం ప్రపంచాన్ని చుట్టేస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. టీడీపీలో సంస్కరణలు తీసుకురావడానికి ఎంతగానో పోరాడామని తెలిపారు. జిల్లాస్థాయి నుంచి పార్లమెంటరీ స్థాయికి పార్టీ ఎదుగుదలకు చాలా పోరాటం చేశామని చెప్పుకొచ్చారు. ఒక మండల పార్టీ అధ్యక్షురాలు శ్రీదేవిని, ధనుంజయ్‌లను పొలిట్‌బ్యూరోలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ఆందోళనలకు అనుమతి ఇస్తున్నామని తెలిపారు. ఎక్కడా కూడా గేట్లను తాళ్లతో కట్టలేదని తేల్చిచెప్పారు. చిన్నచిన్న సమస్యలు ఉండొచ్చని.. వాటిని నాలుగు గోడల మధ్య కూర్చుని పరిష్కరించుకోవాలని సూచించారు. 151 సీట్ల నుంచి 11 స్థానాలకు వైసీపీ ఎలా వచ్చిందో చూశామని.. ప్రజల దగ్గరకు టీడీపీ నేతలు వెళ్లాలని.. వారి సమస్యలు పరిష్కరించాలని మంత్రి నారా లోకేశ్ దిశానిర్దేశర చేశారు. ప్రభుత్వం కొనసాగింపు చాలా అవసరమని... అందరూ ఈ విషయాన్ని ఆలోచించాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. 1983లో టీడీపీని ఎన్టీఆర్ అధికారంలోకి తీసుకువచ్చారని చెప్పారు. 1982లో ఏపీ, బిహార్ తలసరి ఆదాయం ఒకేలాగా ఉండేదని.... టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మార్పు తెచ్చిందని ప్రస్తావించారు. తెలుగుదేశం వరుసగా అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్రం చాలా అభివృద్ధి చెంది ఉండేదని చెప్పుకొచ్చారు. ఏపీలో నమో అంటే నాయుడు... మోదీ జోడీ అని వ్యాఖ్యానించారు. చంద్రబాబు రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు తనకు అండగా పవన్ కల్యాణ్ నిలిచారని ప్రస్తావించారు. చంద్రబాబు జైలుకు వెళ్తున్నప్పుడు తొలిసారిగా పవన్ ఫోన్ చేశారని గుర్తుచేశారు. డబుల్ ఇంజిన్ బులెట్ ట్రైన్ ఉండటంతోనే విశాఖ ఉక్కు, రైల్వేజోన్ సాధించామని తెలిపారు. కర్నూలుకు హైకోర్టు బెంచి తెస్తామని, రాయలసీమకు ÷టైర్ జెట్ పరిశ్రమ తీసుకువచ్చామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్త

రెండు డిజిటల్ మోసాలు వెలుగులోకి వచ్చాయని సీపీ తెలిపారు. కాంచన్‌బాగ్‌లో ఆరుగురు వ్యక్తులు ఒక వ్యాపారితో బేరమాడి, రూ.5వేలు చెల్లించినట్లుగా చూపించే నకిలీ యాప్ స్క్రీన్‌ను చూపించి రూ.68వేల విలువైన పశువులతో ఉడాయించారని తెలిపారు. అదేవిధంగా, రాజేంద్రనగర్‌లో నలుగురు వ్యక్తులు రూ.48వేల విలువైన మేకలను కొనుగోలు చేసి, నకిలీ పేమెంట్ యాప్‌తో బురిడీ కొట్టించారన్నారు. ఖాతాలో డబ్బు జమ కాలేదని గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, మేకలు, గొర్రెల అమ్మకందారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులను అప్పగించే ముందు, మీ బ్యాంకింగ్ ఖాతాలో బ్యాలెన్స్ నిర్ధారించుకోవాలన్నారు. ఎవరైనా మోసం చేయడానికి ప్రయత్నిస్తే డయల్ 100కు కాల్ చేసి పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ

## పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు

హైదరాబాద్,మే27 : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్టిక్ట్ర రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహశీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్డీసీగా , ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

## సీన్ రీ కన్‌స్ట్రక్షన్ కోసం మొయినాబాద్‌కు తరలింపు

హైదరాబాద్,మే27 : పోక్స్ కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం అతడిని మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తరలించారు. సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం భగీరథ్‌ను పోలీసులు ఈ ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లినట్ల తెలుస్తోంది. మరోవైపు భగీరథ్‌ను మూడు రోజులపాటు ప్రశ్నించేందుకు పోలీసులకు కోర్టు అనుమతి ఇచ్చింది. పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. అతడిని కస్టడీకి కోరుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు.. బండి భగీరథ్‌ను మూడు రోజుల పాటు పోలీసుల కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది.దీంతో బండి భగీరథ్‌ను చంచల్‌గూడ జైలు నుంచి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తరలించారు. అతడిని మూడు రోజుల పాటు పోలీసులు విచారించనున్నారు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా.. ఆమెపై అత్యాచారం చేశాడనే ఆరోపణలు బండి భగీరథపై వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మే 16వ తేదీన అతడిని పేట్ బషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. బండి భగీరథ్ నుంచి మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని.. వారం రోజుల పాటు అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పోలీసులు స్పష్టం చేశారు. కానీ కోర్టు మాత్రం భగీరథ్‌ను మూడు రోజుల వరకే పోలీసుల కస్టడీకి అనుమతి ఇచ్చింది.

# అనంతుని ఆభరణాలు మాయం

## సంచనలంగా మారిన డిజిపి నివేదిక

తిరువనంతపురం,మే27 : ప్రసిద్ధ శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేరళ డీజీపీ వెల్లడించడంతో ఆలయ భద్రతపై భక్తుల్లో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. స్వామివారి ఆభరణాలు కనిపించకుండా పోయాయని కేరళ హోంశాఖ సెక్రటరీకి డీజీపీ సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. డీజీపీ నివేదిక ప్రకారం.. ఆలయం నుంచి సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. వాటిలో వైరమ్ నామంగా పిలువబడే వజ్రాల ఆభరణం కూడా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం వైరమ్ నామాన్ని మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట ఆలయం నుంచి బయటకు తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత దానిని తిరిగి తీసుకురాలేదు. అదే విధంగా ఆరు నెలల కిందట ఆలయం నుంచి తీసుకెళ్లిన బంగారు దీపం కూడా కనిపించకుండా పోయింది. దీంతో ప్రస్తుతం ఉన్న భద్రతా ఏర్పాట్లపై డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టి భద్రతను పటిష్ఠం చేయాలని హోం శాఖ సెక్రటరీని కోరారు. సందర్భంగా స్వామివారి విలువైన ఆభరణాల నిర్వహణపై డీజీపీ పలు కీలక సూచనలు చేశారు. అన్ని బంగారు, వెండి వస్తువులను సురక్షిత ఖజానాలకు తరలించాలని నివేదికలో పేర్కొన్నారు. సరైన తనిఖీ లేకుండా ఏ వ్యక్తినీ లోపలికి అనుమతించకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల కానుకలను ప్రత్యేక లాకర్లలో భద్రపరచాలనీ సూచించారు. మరోవైపు స్వామివారి ఆభరణాలు అదృశ్యం కావడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ పద్మనాభ స్వామివారి శతాబ్దాల నాటి సంపద నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆగ్రహిస్తున్నారు.

# కాలుష్యకారక పరిశ్రమలపై చర్యలు తప్పవు

## తప్పదోవ పట్టించేలా ఎపి పేపర్ మిల్లు సమాచారం

## పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

రాజమండ్రి,మే27 : గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గోదావరి నదిలో కాలుష్యాన్ని నివారించేందుకు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పరిశ్రమలు ఇక్కడి వనరులను ఉపయోగించుకుని లాభాలు పొందుతున్నాయని, కానీ కాలుష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఏపీ పేపర్ మిల్ యాజమాన్యం తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించిందని మంత్రి తెలిపారు. పరిశ్రమ నుంచి విడుదలైన రసాయనాల్లో పీహెచ్ స్థాయి 7 శాతం నమోదైనట్లు చెప్పారు. కలుషిత వ్యర్థాలను గోదావరిలో కలుపుతున్నారని, పరిశ్రమ యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పరిశ్రమల నుంచి మురుగునీరు నేరుగా బయటకు వస్తే యజమానులను జైలుకు పంపిస్తామని, గోదావరిలో వ్యర్థాలు కలిపితే ఆ పరిశ్రమలకు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల కోసం రూ.8,500 కోట్ల బ్జడెట్‌తో ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి వెల్లడించారు. యాత్రికుల కోసం టెంట్ సిటీలు, హోం స్టేలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏపీ పేపర్ మిల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆ సంస్థకు రూ.13 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

### నీటిగుంతలో పడి ముగ్గురు బాలల మృతి

పెనుకొండ,మే27 : శ్రీసత్యసాయి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నీటి గుంతలో పడి ముగ్గురు బాలురు మృతిచెందారు. రొద్దం మండలం నారనాగేపల్లిలో ఈ ఘటన జరిగింది. పొలంలో నల్లనేరేడు పండ్ల కోసం వెళ్లి నీటి గుంతలో పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు.

# ఇడి దాడులపై భగ్గుమన్న సిపిఎం

## కేరళలో పలు చోట్ల ఆందోళనలు

## బిజెపితో కాంగ్రెస్ చేతులు కలిపిందన్న నేతలు



తిరువనంతపురం : కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళం శాసనసభ ప్రతిపక్ష నాయకుడైన పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను సిపిఎం ఖండించింది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను నిరంతరం ఉపయోగించడంలో ఇది ఒక భాగమని సిపిఎం అభివర్ణించింది. సిపిఎం, ఇతర ప్రతిపక్ష శక్తులపై జరుగుతున్న విస్తృత రాజకీయ వేధింపులు, వ్యక్తిత్వ హననంలో ఈ దాడులు ఒక భాగమని సిపిఎం పేర్కొంది. ఈ చర్య కేరళ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడిని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ ఖండించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో 'ఇలాంటి చర్యలు పినరయి విజయన్‌ను గానీ, సిపిఎంను గానీ భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో యూడీఎఫ్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ÷ఖనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ జరిపిన దాడిని రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి, లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను పద్ధతి ప్రకారం దుర్వినియోగం చేయడానికి ఇది మరో ఉదాహరణ. ఇటువంటి కక్షపూరిత చర్యలు నిరంకుశ మనస్తత్వాన్ని బయటపెడతాయి. ఈ అప్రజాస్వామిక ఎత్తుగడలకు పినరయి, సిపిఎం బెదరబోవు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల మద్దతుతో సిపిఎం దృఢంగా పోరాడుతుంది. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో చేసినట్లే, ఆయనను లక్ష్యంగా చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ఈడీని చురుకుగా ప్రోత్సహించిందన్నది స్పష్టం' అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను ఉపయోగించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలిపిందని సిపిఎం పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాన్ని కేరళ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఈ చర్యను ప్రతిఘటించాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, కేరళ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి, ప్రజాస్వామ్య నిరసనలు, సామూహిక కార్యాచరణ ద్వారా ఈ రాజకీయ దాడులను ఎదుర్కొం టామని సిపిఎం పేర్కొంది. ఈడీ నిర్వహిస్తున్న సోదాలకు వ్యతిరేకంగా కేరళతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆగ్రహిస్తూ పార్టీ శ్రేణులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు. కన్నూర్‌లోని పినరయి విజయన్ కుటుంబ నివాసం, తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న ఆయన అ÷-దదె ఇంటి ముందు సిపిఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టారు. తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలో సిపిఎం కేరళం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిదన్, వి.శివన్‌కుట్టి, జాన్ బ్రిట్టాస్, వి. జాయ్, అనవూర్ నాగప్పన్, వి.కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కన్నూర్‌లో జరిగిన నిరసనలో ఎం.వి. జయరాజన్, పి. జయరాజన్, కె.కె. రాజేష్, కె.కె. శైలజ తదితరులు పాల్గొన్నారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ మాట్లాడుతూ? ఈడీ సోదాలు పార్టీపై, పినరయి విజయన్‌పై జరిగిన 'హేయమైన రాజకీయ దాడి'గా పేర్కొన్నారు. ఈ చర్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ మాట్లాడుతూ, పినరయి విజయన్‌కు ఎక్సాలాజిక్ వ్యవహారంతో ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టులు ఇప్పటికే పేర్కొన్నప్పటికీ, రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం

## హరీష్ రావు ఆరోపణల నుంచి దృష్టి మరల్చే యత్నం

## తనపై నిందలు మోపి మళ్లీ జైలుకు పంపే కుట్రలు

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ

హైదరాబాద్,మే27 : సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయం పై హరీష్ రావు సంచలన ఆరోపణల నుంచి దృష్టిని మరల్చడానికే మంత్రులు తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మిక సంఘం సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి తనపై కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు. సింగరేణిని సీఎం బామ్మర్దికి అప్పగించారని ఆరోపించారు. తనపై తెలంగాణ ఉద్యమంలో 226 కేసులు ఉన్నాయని, సీసీఎస్ డార్క్ సెల్‌తో సహా హైదరాబాద్ నగరంలో అన్ని పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని వెల్లడించారు.సింగరేణి కార్మికులు, ప్రజల ఓట్లతో రెండు సార్లు గెలిచాను.ప్రజల దృష్టిని మరల్చడానికి తన వ్యాఖ్యలను చీప్ ట్రిక్ కింద వాడారని విమర్శించారు. సీఎం కార్యాలయం డైరెక్షన్ మేరకు తనను ట్రోల్ చేస్తున్నారని వివరించారు. మరోసారి తనపై కేసు పెట్టి జైలుకు పంపుతారేమోనన్న అనుమానం వ్యక్తం చేశారు . క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా ఇబ్బందులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేశారు. . ఫార్మా కంపెనీని కాలుస్తా అన్న జడ్చర్ల ఎమ్మెల్యేపై, నరుకుతా అన్న రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాగూర్‌పై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. నాడు ప్రగతి భవన్‌ను బాంబులు పెట్టి పేల్చాలని పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ఏ వర్గం సంతృప్తిగా లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ ప్రభుత్వం తనను టా÷-గ్గ÷ట్ చేసింది. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి టా÷-గ్గ÷ట్ చేస్తోందని ఆరోపించారు. శ్రీలంకలో,బంగ్లాదేశ్ లో ప్రజలు తిరగబడునట్లు తెలంగాణలోను ప్రజల తిరుగుబాటు వస్తుందని వెల్లడించారు. సీఎం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించే లోగా రైతుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,ఫ్లలె రవికుమార్ , కురువ విజయ్ కుమార్ , తుంగ బాలు , పడాల సతీష్ రాజేష్ ,రవీందర్ రెడ్డి ,హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన తప్పేంటి

## అరెస్ట్ చేస్తామన్న ప్రచారంపై పాశం యాదగిరి ఆగ్రహం

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై ఘాటు విమర్శలు

హైదరాబాద్,మే27 : ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ రావు ఏపీ ప్రభుత్వంపై చేసిన విమర్శల నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను తెలంగాణ ఉద్యమనేత, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి తీవ్రంగా ఖండించారు. నాగేశ్వర్ రావు చేసిన విమర్శల్లో అంత తప్పు ఏముందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా అని ఆయన పాలకులను ప్రశ్నించారు. కేవలం విమర్శలు చేసినందుకే ఒక మేధావిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఘాటైన విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు విప్లవ వీరుడు చేగువేరా బొమ్మలను, ఆయన సిద్ధాంతాలను గుండెలకు హత్తుకుని తిరిగిన పవన్ కళ్యాణ్, ఈరోజు స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు నాయుడు బొమ్మలను పట్టుకుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. మేధావి, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ రావు తో పోలిస్తే పవన్ కళ్యాణ్ ఒక 'లిల్లీపుట్' లాంటివాడని వ్యాఖ్యానించారు. ఎన్నో పెళ్లిళ్లు చేసుకున్న పవన్ కళ్యాణ్ ఇతరులకు సంస్కారం గురించి హితబోధలు చేయడం ఏమిటని ఆయన నిలదీశారు. అసలు అటువంటి వ్యక్తిని తీసుకువెళ్లి ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిని చేయడమే ఒక పెద్ద తప్పిదమని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ వ్యూహాలపై, గత చరిత్రపై పాశం యాదగిరి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎక్కడ పచ్చగా, లాభసాటిగా ఉంటే అక్కడకి వెళ్లి మేసే పశువు తరహాలో, కేవలం అధికారం కోసం రోజుకొక రాజకీయ పార్టీని, రంగులను మార్చే నాయకులు కూడా ఈరోజు నీతులు చెప్పుండటం విడ్డూరంగా ఉందన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానటుడు ఎన్టీ రామారావు మరణానికి కారకుడైన వ్యక్తి, ఈరోజు మళ్లీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కూర్చోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో మీడియా అక్రిడిటేషన్ల మరియు ఛానళ్ల యాజమాన్యాలపై ఆయన సంచలన నిజాలను వెల్లడించారు. స్వరాష్ట్రమైన తెలంగాణలో స్థానిక జర్నలిస్టులకు కాకుండా, ప్రస్తుతం మొత్తం ఆంధ్రా ప్రాంతానికి చెందిన జర్నలిస్టులకే అక్రిడిటేషన్ల కార్డులు ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో వి6 , టి న్యూస్ మినహాయిస్తే, మిగిలిన ప్రధాన వార్తా ఛానళ్లన్నీ ఆంధ్రా యాజమాన్యాల చేతుల్లోనే ఉన్నాయని, మీడియా రంగంలో ఇప్పటికీ వారి ఆధిపత్యమే నడుస్తోందని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి స్పష్టం చేశారు.

# ఎబోలాకు రష్యన్ వ్యాక్సిన్

మాస్కో,మే27 : ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తిపై ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో రష్యా కీలక ప్రకటన చేసింది. బుండిబుగ్యో ఎబోలాకు వ్యాక్సిన్ కనుగొన్నట్లు రష్యా ఆరోగ్య మంత్రి మురాష్కో పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా లోని రష్యా దౌత్యకార్యాలయం ఈ మేరకు ఎక్స్‌లో ప్రకటన చేసింది. రష్యన్ శాస్త్రవేత్తలు కొత్త ఎబోలా స్ట్రెయిన్ కోసం విజయవంతమైన వ్యాక్సిన్‌ను కనుగొన్నట్లు తెలిపింది.

# కొనసాగుతున్న సరస్వతీ పుష్కరాలు

## వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు

కాళేశ్వరం : కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలకు భక్తులు పోటెత్తుతున్నారు. పుష్కరఘాట్‌ల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని పవిత్ర స్నానాలు ఆచరించారు. వేద మంత్రోచ్ఛరణలు, హారతులు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కాళేశ్వర క్షేత్రం మార్మోగుతోంది. ఈ నెల 21న ప్రారంభం అయిన పుష్కరాల్లో భక్తులు వివిధ ప్రాంతాల న ఉంచి వచ్చి నదీ స్నానం ఆరిస్తున్నారు. ఈ పుష్కర పుణ్య స్నానాలకు తెలంగాణ రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి హాజరై పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందించి, పుష్కరాల ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను గురిం చి వివరించారు. అలాగే దేవాదాయ కమిషనర్ హనుమంతరావు హాజరై పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పుష్కరాల సందర్భంగా శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో సకల ఐశ్వర్య ప్రాసస్థ్యం దుర్గ సూక్త హోమం అత్యంత వైభవంగా జరిగింది. పండితులు వేద మంత్రాల నడుమ హోమ క్రతువులను నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. ఆర్టీసీ సంస్థ సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్టింగ్‌ను చూసి మురిసిపో యిన భక్తులు సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. సరస్వతి పుష్కరఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సరస్వతి మాత, శివుని విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే పిల్లలు ఆడు కోవడానికి ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పిల్లాపాపలతో వచ్చిన భక్తులు ఆహ్లాదాన్ని పొందుతున్నారు. అలాగే అంత్య పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మంగళ, గురువారాల్లో కాల సర్ప దోశ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పుష్కరాల నేపథ్యంలో ఆ పూజలను తాత్కలికంగా నిలిపివేశారు. పుష్కర స్నానం ఆచరించి ఆలయంలో ముక్తీశ్వరుడిని దర్శించుకుని వెళ్లారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో ప్రతి రోజూ శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వ హించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ ఆలయానికి వచ్చే భక్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని పునీతులవుతారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కల్యాణాన్ని నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్నారు.

# నగరంలో ఆర్టీవో కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

## ఏకకాలంలో 8మంది అధికారుల బృదం తనిఖీలు

హైదరాబాద్,మే27 : హైదరాబాద్ నగరంలోని పలు ఆర్టీవో కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మేడ్చల్ ఆర్టీవో కార్యాలయం, నాగోల్ ఆర్టీవో కార్యాలయాలతో పాటు కొండాపూర్ ఆర్టీవో కార్యాలయంలో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. సుమారు 8 మంది అధికారులతో కూడిన బృందాలు ఏకకాలంలో కార్యాలయాలను తనిఖీ చేస్తున్నాయి. ఆర్టీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీబీ ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. పెండింగ్ ÷ళ్లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, డ్రైవింగ్ లైసెన్సుల జారీ పక్రియపై అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే ఆర్టీఏ ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులను కూడా విచారిస్తున్నారు. ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర రిజిస్ట్రేషన్ పనులు అక్రమంగా జరుగుతున్నాయనే సమాచారంతో ఈ సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

# మోపాల్ మండలంలో చిరుత సంచారం

## గ్రామ శివారులో సంచరించినట్లు గుర్తింపు

నిజామాబాద్,మే27 : జిల్లాలోని మోపాల్ మండలంలో చిరుత పులి సంచారం తీవ్ర కలకలం రేపింది. మండల పరిధిలోని సిరిపూర్ గ్రామంలో రాత్రి వేళ చిరుత సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. గ్రామ శివార్లలో ఉన్న ఒక పశువుల పాక సమీపంలోకి చిరుత రావడాన్ని గమనించిన ఓ కుక్క గట్టిగా మొరగడంతో, చిరుత అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్ళిపోయింది. అయితే, ఈ దృశ్యాలన్నీ స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌లో స్పష్టంగా రికార్డు కావడంతో సిరిపూర్ గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావడానికి, పొలాలకు వెళ్లడానికి రైతులు, కూలీలు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి చిరుత దాడి చేస్తుందోనని స్థానికులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఈ సీసీటీవీ ఫుటేజ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చుట్టుపక్కల గ్రామాల్లోనూ ఆందోళన నెలకొంది. అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, గ్రామంలో బోన్లు ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని, తమకు రక్షణ కల్పించాలని సిరిపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు

## ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వెల్లడి

హైదరాబాద్,మే27 : తెలంగాణలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. మోస్తరు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ఆ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు హైదరాబాద్ సహా పలు జిల్లాలకు అలర్ట్ జారీ చేశారు. జనగామ, మహబూబ్‌నగర్, మేడ్చల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రానున్న మూడు గంటల్లో వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు, మూడు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని నెలలుగా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఇది ఉపశమనం కలిగించినట్లు అయ్యింది. మరోవైపు అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.

# సంపాదకీయం

## అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపాల్సిందే !

దేశంలోకి నానాటికీ పెరుగుతున్న అక్రమ వలసలతో దేశ ఆర్థిక వ్యవస్థకు సావాల్‌గా మారింది. అలాగే దేశంలో అలజడులకు కారణమవుతోంది. పెరుగుతున్న జనాభాకు తోడు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారి కారణంగా పలు రాష్ట్రాలు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నాయి. దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. ఓటర్లుగా ఉన్న విదేశీయులను మొన్నటి ఎన్నికలకు ముందు సర్ ప్రక్రియలో లక్షల్లో తొలగించారు. దీనిపై నాటి సిఎం మమతా బెనర్జీ నానాయాగీ చేశారు. అసలు ఎంతమంది ఉన్నారన్నదానికి లెక్కాపత్రం లేనంతగా ఇక్కడ అక్రమ వలసదారులు చేరిపోయారు. అమెరికాలో ట్రంప్ వచ్చాక నిర్దాక్షిణ్యంగా అక్రమ వలసదారులను తన్‌ఇన తరిమేశారు. ప్రపంచ దేశాలు నిరసనలు వ్యక్తం చేసినా ట్రంప్ పట్టించుకోలేదు. ఇది ఓ హెచ్చరికగా అన చర్యలు నిలిచాయి. ఇప్పుడు భారత్ కూడా అలాంటి చర్యలను కఠినంగానే తీసుకోక తప్పదు. ఈ క్రమంలో బెంగాల్లో అక్రమవలసదారులపై ప్రభుత్వం కోరడా ఝుళిపించింది. ఇకపోతే అక్రమ వలసతకు  చెక్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అక్రమ వలసలు, చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశంలో జరుగుతున్న అసహజ జనాభా మార్పులపై అధ్యయనానికి ఒక ఉన్నత స్థాయి కమిటీ ని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా  ప్రకటించారు. ఈ సమస్య భారతదేశ సార్వభౌమత్వా నికి, జాతీయ భద్రతకు, సామాజిక సమతుల్యతకు, గిరిజన సమాజాల పరిరక్షణకు పెనుసవాలుగా మారడం తో ఈ నిర్ణయం తీసుకున్నారు.  ఈ కమిటీ ఏర్పాటుకు సంబంధించి గత ఏడాది స్వాతంత్య దినోత్సవం నాడు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నవోలేకర్ అధ్యక్షత వహించే కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి, జనగణన కమిషనర్ సభ్యులుగా ఉంటారని, హోంశాఖ సంయుక్త కార్యదర్శి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని 'ఎక్స్'లో చేసిన పోస్టులో షా పేర్కొన్నారు. అక్రమ వలసలు, సరిహద్దుల్లో చొరబాట్లు, ఇతర అసాధారణ కారణాలతో దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న మార్పులతో పాటు మత, సామాజికవర్గాల వారీగా అసాధారణ జనాభా మార్పుల సరళిని ఈ కమిటీ సమగ్రంగా విశ్లేషిస్తుందని తెలిపారు. ఈ సమస్యలకు అర్థవంతమైన, విధానపరమైన, కాలపరిమితితో కూడిన పరిష్కారాలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని అమిత్ షా తెలిపారు. ఇదిలా వుంటే బెంగాల్లో అక్రంగా తిష్టవేసిన వారు ప్రభుత్వాలను శాసించే స్థాయికి చేరారు. మమతా బెనర్జీ హయాంలో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారు ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు పొంది, స్థానికులనే సవాల్ చేసే స్థాయికి చేరారు.  ఈ క్రమంలో కొత్తగా అధికారం చేపట్టిన సువేందు అధికారి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అక్రమ వసలదారులను తరిమేసే పనులు చేపట్టింది. కొంచెం కఠినంగానే హెచ్చరించింది. తన్ని తరిమేసే వరకు ఆగకుండా పారిపోవాలని హెచ్చరించింది. ఈ క్రమంలో సరిహద్దులకు బంగ్లా అక్రమచొరబాటుదార్లు చేరుకుంటున్న దృశ్యాలు చూస్తున్నాం. దీనిని బట్టి ఎంతగా ఇక్కడ తిష్టవేశారో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా జరుగుతున్న క్రమంలోనే బెంగాల్లో కొత్త ప్రభుత్వం కఠిన చర్యలు ఇప్పుడు అక్కడ అక్రమవసలదారుల గుండెల్లో దడపుట్టిస్తోంది. తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొనేలోపే రాష్ట్రం విడిచి పారిపోవాలని చొరబాటుదారులను సీఎం సువేందు అధికారి తీవ్రంగా హెచ్చరించారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని, వారిని తీసుకెళ్లడం ఆ దేశ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైలుకు పంపవద్దని కూడా పోలీసులను ఆదేశించారు. అసలు మనం వారికి ఆశ్రయం ఎందుకివ్వాలి? వారికోసం మన దేశ వనరులను ఎందుకు వృథా చేసుకోవాలి? ఈ చొరబాటుదారులేమైనా మన అల్లుళ్లా?' అని సువేందు ప్రశ్నించారు. గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి నినాదంతో రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను వెనక్కి పంపడానికి బెంగాల్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. బంగ్లాదేశ్ అక్రమ వలసదారులపై విదేశీయుల చట్టం కిందే ఈ చర్యలు తీసుకుంటామని చెప్పారు. తక్షణం అక్రమవలసదారులు ఈ ప్రదేశాన్ని వదిలివెళ్లాల్సిందేనని అన్నారు. తమ పౌరులను వెనక్కి తీసుకునే బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వంపైనే ఉందన్నారు. కాగా, అక్రమ వలసదారులను వెనక్కి పంపించేందుకు బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు స్వదేశానికి తిరుగుముఖం పడుతున్నారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకింపూర్ సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం పెద్ద ఎత్తున వారు గుమిగూడారు. రాష్ట్రంలో ఎస్‌ఐఆర్ సమయంలోనూ ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో అక్రమ వలసదారులపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి.. చట్ట విరుద్ధంగా ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యాల ను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో నిర్బంధ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు పట్టుబడిన విదేశీయులు, దేశ బహిష్కరణకు గురైన వారు, జైలు నుంచి విడుదలై.. తమ తమ దేశాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్న విదేశీ ఖైదీలను తక్షణమే నిర్బంధ కేంద్రాలకు తరలించాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర హోం శాఖ లేఖలు రాసింది. మొత్తంగా బెంగాల్లో ఏరివేత కారణంగా బీహార్, అసోం తదితర రాష్ట్రాల్లో వారు షెల్టర్ పొందకుండా చూడాలి. అక్కడి ప్రభుత్వాలు కూడా కఠినంగా వ్యవహరించాలి. అలాగే హైదరాబాద్‌లో తిష్టవేసిన రోహిగ్యాలను కూడా పట్టుకని పంపించాలి.

# మండుటెండలపై దీర్ఘకాలిక యుద్ధం



రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు కూడా పగులుతాయని ప్రతీతి. గత నాలుగైదు దశాబ్దాలుగా రోహిణి కార్తె రాకముందే ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఎడారి ప్రాంతాలుగా పేరుపడిన గల్ఫ్ దేశాల్లో ఒకప్పుడు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటితే ముక్కున వేలేసుకునేవాళ్లం. ఇప్పుడు భారతదేశంలోనే ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతున్న దుస్థితి దాపురించింది. ప్రస్తుత ఎండాకాలంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ లోని కంకిపాడు, పెనమలూరు, పిడుగురాళ్ల వంటి చోట్ల ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలకు చేరుకోవడం చూస్తున్నాం. తెలంగాణలోను పలు ప్రాంతాల్లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గోరుచుట్టుపై రోకటిపోటులా.. ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నగరాలలో 50 వరకూ భారతదేశంలోనే ఉన్నట్లు వాతావరణ అధ్యయన సంస్థ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఇటీవల పేర్కొనడం మరింత ఆందోళన కలిగించే విషయం. ఈ యాభై నగరాల్లో సగం వరకూ ఉత్తరప్రదేశ్‌కు చెందినవే కాగా, తెలుగు రాష్ట్రాల్లోని ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, జగిత్యాల, భీమవరం వంటి పట్టణాలు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. గత వారం ఒక్కరోజులో నమోదైన ఉష్ణోగ్రతల ఆధారంగానే ఈ నివేదిక వెలువడినా, పరిస్థితి గంభీరంగా ఉందనే విషయాన్ని ఈ నివేదిక నొక్కి చెబుతోందన్న విషయాన్ని విస్మరించకూడదు. మార్చి- మే నెలల మధ్య ఎండల వేడి అధికంగా ఉండటం సహజమే అయినా, ఈ ఏడాది వేసవి వచ్చీరావడంతోనే ప్రతాపం చూపించడం మొదలుపెట్టింది. మార్చి రెండోవారంలోనే కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదు కావడం వాతావరణంలో ఏర్పడుతున్న పెనుమార్పులకు నిదర్శనం. మరోవైపు వడగాడ్పులు సైతం ప్రజలను మాడ్చిమసిచేస్తున్నాయి. రోజుకు పదుల సంఖ్య లో జనం మండుటెండలకు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎండల ప్రభావం ప్రజలకు ఆరోగ్య సమస్యలను తెచ్చిపెట్టడమే కాదు, ఆర్థిక వ్యవస్థతోపాటు వ్యవసాయ, నీటిపారుదల వంటి పలు రంగాలపైనా పెనుప్రభావం చూపిస్తుంది. గిగ్ వర్కర్లు, దినసరి వేతనజీవులు, భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లభించక, లభించినా మండుటెండల్లో పనిచేయలేక అల్లాడుతున్నారు. ఎండల వేడిమి కారణంగా కార్మికులు ఉపాధి కోల్పోవడం, వ్యవసాయం, మైనింగ్, భవన నిర్మాణ రంగాలు కుదేలు కావడం వంటి కారణాల రీత్యా 2030 నాటికి భారత జిడిపిలో 4.5 శాతం నష్టపోవచ్చునని ప్రపంచ బ్యాంకు అంచనా. అంతకంతకూ పెచ్చుమీరుతున్న మండుటెండల ప్రభావం కాలానుగుణమైనదేనని సరిపెట్టుకుంటే అంతకంటే అమాయకత్వం మరొకటి ఉండదు. ఇంతటి విపత్కర పరిస్థితులకు కారణం వాతావరణ మార్పులేనన్నది సుస్పష్టం. అడవుల నరికివేత, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారం, పట్టణీకరణ వంటివి భూమధ్య రేఖకు సమీపాన ఉన్న భారతదేశాన్ని పెనంమీదనుంచి పొయ్యిలో పడేలా చేస్తున్నాయి. వీటి కారణంగా ఎండలు, వడగాడ్పుల ప్రభావం అంతకంతకూ అధికమవుతున్నాయని నాలుగు దశాబ్దాలుగా వాతావరణ శాస్త్రవేత్తలు నెత్తీనోరూ మొత్తుకుంటున్నా పట్టించుకునేవారు కరవవుతున్నారు. వేసవి వచ్చిందంటే చలివేంద్రాలు పెట్టించి, వడదెబ్బ తగిలితే ఆస్పత్రిలో చికిత్స చేయించి పంపించడంతో ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నాయి. వడదెబ్బ మృతులకు పరిహారం అందించేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తున్న పాలకులు మండుటెండల ప్రభావాన్ని అరికట్టేందుకు దీర్ఘకాలిక ప్రణాళికల రూపకల్పన అత్యవసరమనే విషయాన్ని విస్మరిస్తున్నారు. వడదెబ్బకు బలవుతున్నవారిలో అధిక సంఖ్యాకులు నిరుపేదలే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవిలో జనావాసాలతో కిటకిటలాడే ప్రాంతాల్లోనూ, మురికివాడల్లోనూ వాతావరణాన్ని చల్లబరిచే ప్రక్రియలను అమలు చేయాలి. ఇళ్ల పైకప్పులకు గ్రీన్ రూఫ్ లతోపాటు తక్కువ వేడిని గ్రహించే సామగ్రిని వినియోగించడం తప్పనిసరి చేస్తూ నిబంధనల రూపకల్పన జరగాలి. కాంక్రీట్ జంగిల్ లా మారుతున్న పట్టణాలు, నగరాల్లో బహిరంగ స్థలాలను, పార్కులను విస్తరించాలి. ఇవన్నీ ఒక ఎత్తయితే, హరితవనాలను పెంపొందించడం, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించే దిశగా ప్రజలను చైతన్యవంతుల్ని చేయడం మరొక ఎత్తు. బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తిని తగ్గించి, సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలి. ప్రస్తుత వేసవి మిగిల్చిన చేదు జ్ఞాపకాలను గుణపాఠంగా తీసుకుని, ఏటా వేసవి రాకముందే ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకోవాలి. వేసవి ఒకప్పుడు సహజ రుతు లక్షణమేమో గానీ, ఇప్పుడు కాదు. రుతువులన్నీ కలగాపులగమై, ఎండాకాలంలో జడివానలు, వర్షాకాలంలో మండుటెండలనూ చవిచూస్తున్న రోజులివి. కాబట్టి, ఆయా కాలాల్లో తలెత్తే ప్రకృతి వైపరీత్యాలను దీటుగా ఎదుర్కొనేందుకు బడ్జెట్లో ప్రత్యేకంగా కేటాయింపులు జరపడం అత్యవసరం.

# పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య

### సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం

వాషింగ్టన్,మే27 :  అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న చర్చల్లో మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ పాత్రపై అగ్రరాజ్య సెనెటర్ లిండ్సే గ్రాహం అనుమానం వ్యక్తం చేశారు. పాక్ మధ్యవర్తిత్వమే అసలు సమస్య అని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ఇజ్రాయెల్‌తో శత్రుత్వం నేపథ్యంలో పాకిస్థాన్ నిష్పాక్షిక మధ్యవర్తిగా వ్యవహరించలేదని గ్రాహం అభిప్రాయపడ్డారు. ఇరాన్‌తో శాంతి చర్చల్లో పాల్గొంటున్న దేశాలు అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చిన పిలుపుపై పాకిస్థాన్ ఆసక్తి కనబరచలేదు. అబ్రహం ఒప్పందాల్లో చేరేది లేదని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో పాక్‌పై గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇజ్రాయెల్‌ను వ్యతిరేకించే దేశం మధ్యవర్తిగా వ్యవహరించడం మరింత సమస్యాత్మకం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్‌పై పాకిస్థాన్ సుదీర్ఘ కాలంగా ద్వేషంతో రగిలిపోతోంది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా గతంలో పాక్ ఉన్నత స్థాయి అధికారులు చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరంగా ఉన్నాయి. అబ్రహం ఒప్పందాలపై సంతకాలు చేయాలని ట్రంప్ ఇచ్చిన పిలుపునకు పాక్ వెంటనే సమాధానం ఇవ్వాలి. పాక్ ఎయిర్‌బేస్‌లో ఇరాన్ సైనిక విమానాలు పార్క్ చేసి ఉన్నట్టు ఇటీవల వచ్చిన వార్తలు అవాస్తవాలని కొట్టిపారెయ్యలేం' అని గ్రాహం పేర్కొన్నారు.

# ఉంగాండా మహిళలో ఎబోలా లక్షనాలు

### బెంగళూరుకు చేరుకున్న వెంటనే పరీక్షలు

### ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స

బెంగళూరు,మే27 : ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాపిస్తోన్న ఎబోలాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్న క్రమంలో బెంగళూరులో ఉగాండాకు చెందిన మహిళకు ఈ వ్యాధి  లక్షణాలు కన్పించాయి. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ మహిళ (28) ఈనెల 23న ఉగాండా నుంచి కెంపెగౌడ విమానాశ్రయంలో దిగారు. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు అధికారులు స్క్రీనింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఆ మహిళలో ఈ వ్యాధికి సంబంధించి తేలికపాటి లక్షణాలను గుర్తించారు. దీంతో ముందుజాగ్రత్త చర్యగా ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆమె శాంపిల్స్ సేకరించి, పరీక్షల కోసం పుణెలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. రెండు రోజుల్లో వీటి ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కర్ణాటక ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిత్విక్ రంజన్‌పాండే దీనిపై మాట్లాడారు. ప్రస్తుతం ఆ మహిళ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉందన్నారు. ఆమెలో కన్పించిన లక్షణాలు ఎబోలాకు సంబంధించినవేనా.. కాదా అనే విషయంపై స్పష్టత ఇవ్వలేమన్నారు. ఈ సందర్భంగా సదరు మహిళలో ఒళ్లునొప్పులు, అలసట వంటి లక్షణాలను ఎయిర్‌పోర్టు సిబ్బంది గుర్తించారు. వెంటనే ఆమెను బెంగళూరు ఇందిరానగర్‌లోని ప్రభుత్వ అంటువ్యాధుల ఆస్పత్రికి తరలించి ఐసోలేట్ చేశారు. మహిళకు ఇప్పటివరకు ఎబోలా వ్యాధి నిర్ధారణ కానప్పటికీ ఆస్పత్రి సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఎబోలా నిర్ధారించేందుకు పరీక్ష నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఔఎ÷ఎ)కి తరలించారు. కాగా, మరో రెండు రోజుల్లో ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. మరోవైపు భారతదేశంలో ఎబోలా వైరస్ వ్యాధి కేసులు నమోదు కాలేదని, ప్రయాణికురాలి పరిస్థితి నిలకడగానే ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. 'ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవల ఎబోలా వైరస్ వ్యాప్తి చెందిన దృష్ట్యా భారత ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోంది' ఓ ప్రకటనలో పేర్కొంది.


# కొచ్చిన్ మినరల్స్ లిమిటెడ్ కేసు

### మాజీ సిఎం పినరయ్ నివాసాలపై ఇడి దాడులు

తిరువనంతపురం,మే27(ఆర్ఎన్ఎ):  కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులకు దిగింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో భాగంగా సోదాలు చేపట్టింది. మాజీ సీఎం నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. రూ.1.72 కోట్ల ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ అనే ప్రైవేట్ కంపెనీ 2018-2019 మధ్యకాలంలో మాజీ సీఎం విజయన్ కుమార్తె టి.వీణకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి ఎలాంటి సేవలు అందించలేదు. అయినప్పటికీ సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి రూ.1.72 కోట్లు అక్రమంగా చెల్లించారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే, 2024లో ఈ ఆరోపణలపై విచారణ జరిపేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం  కింద ఈడీ కేసు దాఖలు చేసింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మంగళవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. బుధవారం  తెల్లవారుజామున ఈడీ అధికారులు తిరువనంతపురం లోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసం, కోజికోడ్‌లోని మాజీ పర్యాటక శాఖ మంత్రి పి.ఎ. మహమ్మద్ రియాస్ నివాసంతో సహా పలుచోట్ల ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు.

# త్యాగం.. మహోన్నతం

ఇస్లాంలో ఖుర్బానీ (త్యాగం), బలి దానాల భావన అత్యంత ఉన్నతమైనది. ఈదుల్ అజ్హాను ఖుర్బానీ పండుగ అని కూడా పిలుస్తారు. హజ్రత్ ఇబ్రహీం (అ.స) అసాధారణ త్యాగాలను ఈ పండుగ గుర్తుచేస్తుంది. 'మీరు అమితంగా ప్రేమించే వస్తువులను అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టనంత వరకు మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు' అని త్యాగం విలువలను అల్లాహ్ ఖురాన్‌లో (3: 92) వివరించారు. త్యాగనిరతి ఎంత ఎక్కువగా ఉంటే, సత్కార్య ప్రమాణం అంత ఎక్కువగా ఉంటుంది. హజ్రత్ ఇబ్రహీం (అ.స)కు అల్లాహ్ ప్రసన్నత కోసం చూపిన గొప్ప త్యాగనిరతి అల్లాహ్ పట్ల ఆయనకు ఉన్న అపారమైన ప్రేమ వల్లనే జనించింది. 'ఆయన నాకు మార్గం చూపుతున్నాడు. నా ఆకలిని తీర్చి నా రోగాలను నయం చేస్తున్నాడు. ఆయనే మృత్యువును కలిగించి మళ్లీ జీవితాన్ని అనుగ్రహిస్తాడు' అని హజ్రత్ ఇబ్రహీం (అ.స) అన్నారు. దేవుడు ఒకే ఒక్కడనే ఏకదైవారాధన సందేశాన్ని ప్రజలకు అందించడానికి హజ్రత్ ఇబ్రహీం (అ.స) తన జీవితాన్ని అంకితం చేశారు. సమాజం వ్యతిరేకించినా, రాజు (నమ్రూద్) మరణ శిక్ష విధించినా ఆయన తన లక్ష్యాన్ని వీడలేదు. తన భార్యను, పసిబిడ్డను చుక్క నీరు లేని నిర్జన లోయలో విడిచి పెట్టాల్సి వచ్చినా చలించలేదు. కన్న కొడుకుని బలి ఇవ్వమని ఆదేశం వచ్చినా వెనుకాడలేదు. ఈ మూడు పరీక్షల్లో విజయం సాధించిన తర్వాతే, అల్లాహ్ ఆయన్ను మానవాళికి నాయకుడిగా చేశాడు. అల్లాహ్ ప్రేమ కోసం సమస్తాన్నీ త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని హజ్రత్ ఇబ్రహీం (అ.స) జీవితం మనకు తెలియజేస్తుంది



ఆధ్యాత్మికం

# అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతన్నలకు అండగా నిలవాలి

## • బీఆర్ఎస్ శ్రేణులకు కోరుకంటి చందర్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను పార్టీ శ్రేణులు సందర్శించాలి. రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వలన మార్కెట్ యార్డుల్లో తమ ధాన్యశీ మక్కలను కోల్పోతున్న రైతన్నలు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలకు ఈ దుస్థితి. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. మిగిలిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లను తక్షణమే అందజేయాలి. వెంటనే మార్కెట్ యార్డులలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి. పంట కొనుగోలు పైన ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వానికి డిమాండ్. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని కోరుకంటి చందర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతులకు అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన కోరుకంటి చందర్. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని కోరుకంటి చందర్ ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కోరుకంటి చందర్ సూచించారు. రామగుండం నియోజకవర్గం పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు.నాయకులు.కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని ఐకెపి సెంటర్ లను వద్ద కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే తడిసిపోయి ఆందోళనలో ఉన్న ప్రతి రైతుకు పార్టీ తరపున అండగా నిలవాలని, పూర్తి మద్దతు, సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఎం ఎస్ పి) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. అలాగే, వెంటనే మార్కెట్ యార్డులలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, మిగిలిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లను తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రైతు కంటతడి పెడితే ఏ ప్రభుత్వానికీ మనుగడ ఉండదు అని పేర్కొన్న కోరుకంటి చందర్. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని హెచ్చరించారు.

# పెవిలియన్ గ్రౌండ్ నందు మట్టి పిడతల్లో పక్షులకు నీళ్లు ఏర్పాటు

## • యూనిటీ ఇన్ డైవర్సిటీ స్వచ్ఛంద సంస్థ




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు యూనిటీ ఇన్ డైవర్సిటి స్వచ్ఛంద సంస్థ మట్టి పిడతల్లో నీళ్లు ఏర్పాటు చేశారు. పెవిలియన్ గ్రౌండ్ లో పలుచోట్ల చెట్లకు మట్టి పాత్రల్లో నీళ్లు నింపి పక్షులకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా యూనిటీ ఇన్ డైవర్సిటి స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కత్తి నెహ్రూ గౌడ్, షేక్. జాఫర్ మాట్లాడుతూ ఎండాకాలంలో పక్షులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు చిన్న పాత్రల్లో అయినా నీళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జీవరాశులను కాపాడటం ప్రతి మనిషి బాధ్యత అని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈరోజు బుధవారం స్థానిక పెవిలియన్ గ్రౌండ్ లో వాకర్స్ అసోసియేషన్ సహకారంతో యూనిటీ ఇన్ డైవర్సిటి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి పిడతల్లో పక్షులకు నీళ్ళు ఏర్పాటు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. పక్షులకు నీళ్ళు ఏర్పాటు చేసిన యూనిటీ ఇన్ డైవర్సిటి స్వచ్ఛంద సంస్థ సభ్యులను స్థానిక పెవిలియన్ గ్రౌండ్ నడక సాదకులు అభినందించారు. మరింత మంది ముందుకు వచ్చి పక్షులకు నీళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనిటీ ఇన్ డైవర్సిటి స్వచ్ఛంద సంస్థ వైస్ ప్రెసిడెంట్ వి.డి.ఐ.జయరాజు, ట్రెజర్ బోగా గిరి, సహాయ కార్యదర్శి రాకమ్ శ్యాం బాబు, సంస్థ స్థాపక సభ్యులు యం.డి.బషీర్ అహ్మద్, మంద వెంకటేశ్వర్లు, 45వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బుడిగెం శ్రీనివాస్, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ కమిటీ సభ్యులు రామనాథం, విజయ్, దామోదర్ రెడ్డి, చంద్ర శేఖర్, వెంకట్, శ్రీనివాస్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ నర్సింహారావు, గోవింద రావు, హరి, రమ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో అందని కాడికి అవినీతి

**- సిపిఎం నాయకులు మడిపల్లి గోపాలరావు - అధికారులు కలిసి ప్రభుత్వ పనులపై కోట్ల రూపాయల కొల్లగొట్టే యత్నం - అభివృద్ధి పేరుతో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టారు - సిపిఎం నాయకులు డిమాండ్**



మధిర ది క్రైమ్ న్యూస్ ప్రతినిధి మే 27 అభివృద్ధి ముసుగులో మధిర మున్సిపాలిటీ లో ప్రభుత్వ ఖజానాకు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు గండి కొడుతున్నారని సిపిఎం డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు అన్నారు. బుధవారం బోడెపుడి భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమ్మక్కై మధిర మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో అందిన కాడికి అవినీతి చేస్తున్నారు అందులో భాగంగా అంబారుపేట గ్రామంలోని మురుగు నీటి శుద్ధి ప్లాంట్ పేరుతో తక్కువ రేటు ఉన్న భూమిని ఒక కౌన్సిలర్ కోట్లు రూపాయలు పెంచి ప్రజాధనాన్ని దండుకోవాలని చూస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా చెరువుల నాక్రమించి రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటు వ్యాపారం తెలిసి తెలియనట్లు వ్యవహరిస్తున్న అధికారులు అదేవిధంగా మధిర స్మశాన వాటిక పేరుతో మట్టిని అమ్ముకుంటున్నారని,మధిర పలు అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి జరుగుతుందని, ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం పార్టీ నుండి డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, మండల కార్యదర్శి మంద సైదులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యవసరం వస్తువుల వేతిరేకంగా

## మే 30న తాసిల్దార్ కార్యాలయం ముట్టడి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) :** రెక్కాడితే కానీ డొక్కాడని పేద, బడుగు, బలహీన ప్రజల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారిపై మోయలేని భారం మోపుతున్నారని వీటికి వ్యతిరేకంగా పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని మే 30న తిరుమలాయపాలెం తాసిల్దార్ కార్యాలయం ముట్టడి చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్( ప్రజాపంథా) ఖమ్మం జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధువారం రోజు న పిండిప్రోలు గ్రామంలో రాయల వెంకట్ నారాయణ భవనం లో మండల నాయకులు మీగడ సత్యం అధ్యక్షతన జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో కమ్మ కోమటి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పూట గడవని పేదల పైన అధిక ధరలను పెంచుతూ ప్రజలను దీనస్థితిగా మారుస్తున్నారని అన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్య లేకుండా ఇంటికొక ఉద్యోగం ఇస్తానని ప్రజల పైన ఎలాంటి భారం వేయకుండా చూస్తానని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 5 రాష్ట్రాల ఎన్నికలు అయిపోగానే విపరీతమైన ధరలు పెంచి లేదా ప్రజలు నిత్యవసర వస్తువులు కొనే పరిస్థితి లేకుండా చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన వెంటనే నీరు పేదలను గుర్తించి ప్రభుత్వం ఇల్లు ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అలాగే రేషన్ కార్డులు, అన్ని రకాల పెన్షన్లు ఇవ్వాలని నాగేశ్వరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మే 30న తిరుమలాయపాలెంలో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ( ఏఐపీకే ఎంఎస్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు పునుగుజ్జు వెంకటస్వామి, ఆరంపల్లి వెంకన్న, బానోత్ శంకర్, గోకినపల్లి సరోజన, తుపాకుల నాగేశ్వరరావు, నామ అప్పారావు, రాయిండ్ల చిరంజీవి, దొడ్డ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ఊషన్నపల్లి హెచ్ఎం ఈర్ల సమ్మయ్యకు ఘన సన్మానం



**సుల్తానాబాద్, మే 27(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ కళాభారతి వేదికగా జరిగిన రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో పెద్దపెల్లి జిల్లా, కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) ఈర్ల సమ్మయ్య ప్రతిభ కనబరిచి ఘన సన్మానం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి లఘు చిత్ర నిర్మాతల మండలి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు, కళాకారుడు కనపర్తి శ్రీనివాస్ నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహించారు. బహు భాషా గాయకుడు డాక్టర్ కె.జె ఏసుదాసు ఆలపించిన పాటలపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఈర్ల సమ్మయ్యను కార్యక్రమ నిర్వాహకులు శాలువ, జ్ఞాపిక, మరియు ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో పాల్గొనడం తనకు ఎంతో గొప్ప అనుభూతిని మిగిల్చిందని, ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని ఆనందం వ్యక్తం చేశారు. సమ్మయ్యకు సన్మానం జరగడం పట్ల పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**బక్రీద్ పండుగ నేపథ్యంలో మసీదులు, స్లాటర్ హౌస్‌ల తనిఖీ**

**పోలీసు శాఖకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి విజ్ఞప్తి**






**గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్):** బక్రీద్ పండుగ నేపథ్యంలో మసీదులు, స్లాటర్ హౌస్‌లలో నిర్వహించాల్సిన పనులపై నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి సూచించారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మసీదులు, స్లాటర్ హౌస్‌లను ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, వెటర్నరీ వైద్యుడు డాక్టర్ ప్రసాద్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ పండుగను సురక్షితంగా నిర్వహించేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. వెటర్నరీ డాక్టర్ ధృవీకరణ పత్రం ఉంటేనే పశువుల వధ ప్రక్రియ చేపట్టాలని, వధ సమయంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి చట్టపరమైన నిబంధనలకు కట్టుబడి ఉండాలని వివరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పండుగను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

# మోసం కేసులో నిందితుడి రిమాండ్.....!

**ఇల్లంతకుంట, మే27(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో ఓ నిందితుడిని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండలకేంద్రానికి చెందిన దయ్యాల కిషోర్ అనే వ్యక్తి, గంగాధర మండలం కొండన్నపల్లికి చెందిన ఉత్తం రఘు అనే వ్యక్తి వద్ద గత రెండేళ్ల క్రితం ఓ కారును 6లక్షలకు కొనుగోలు చేసి కారుపై లోన్ తీసి 4లక్షల డబ్బులు చెల్లించాడు.కాగా అప్పటికే కారుపై ఉన్న లోన్ క్లియర్ చేసుకున్న రఘు ఎన్ఓసి ఇవ్వకపోగా కారు సీజ్ అంటూ తన స్నేహితుడిని పంపి కారు తీసుకెళ్ళాడు. కారు ఇవ్వక, డబ్బులివ్వక రఘు తనను మోసం చేశాడంటూ బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడు రఘుపై ఎస్ఐ సిరిసిల్ల అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కాగా పూర్తి విచారణ చేసి నిందితుడు ఉత్తెం రఘును బుధవారం జ్యూడిషల్ రిమాండుకు తరలించినట్లు రూరల్ సిఐ కదిరి నాగేశ్వరరావు తెలిపారు.

# నెహ్రూ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం ఆయన కృషి



**మధిర ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్): మే 27:** భారతదేశ తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారత నిర్మాత, జవహర్లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం నాడు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు ఆమహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వర్గీయ నెహ్రూ దేశ అభివృద్ధికి పునాది వేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, శాంతి సిద్ధాంతం, విజ్ఞాన సాంకేతిక రంగాల అభివృద్ధి, విద్యా వ్యవస్థ బలోపేతం కోసం ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. భారతదేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లిన గొప్ప దార్శనికుడు నెహ్రూ గారేనని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్తు కోసం ఆయన చూపిన మార్గం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు , జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు మధుర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోన ధని కుమార్ నియోజకవర్గ యూత్ నాయకులు తూమాటి నవీన్ రెడ్డి, కౌన్సిలర్ బొల్లెద్దు విజయ కుమారి పట్టణ కాంగ్రెస్ నాయకులు షేక్ జహంగీర్, రంగా శ్రీనివాసరావు, జింకల కోటేశ్వరరావు, నకిరేకంటి గోవింద్, సిద్ధంశెట్టి సందీప్, తోట సాయి, జమీల్ పాషా, షేక్ గౌసుద్దీన్ దూదేకుల జానీ, ప్రసాద్ గౌడ్,మల్లెల సత్యనారాయణ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

- దేశవ్యాప్తంగా "గాయ్ రక్షక్ దళ్" ఏర్పాటు
- భారత ఐక్యత కోసం ముస్లింల త్యాగాలు చారిత్రాత్మకం
- రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భారతీయ సంస్కృతి, సహజీవన స్ఫూర్తి, మానవతా విలువలకు ప్రతీకగా గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక, ఫౌండర్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ ఆలీ పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గోమాత రక్షణ కేవలం ఒక మతానికో, వర్గానికో పరిమితం కాదని, అది భారతీయ సంస్కృతి, జాతీయత, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా "గాయ్ రక్షక్ దళ్" ఏర్పాటు ద్వారా గోవుల సంరక్షణకు సమగ్ర విధానాలు తీసుకురావాలని సూచించారు. ప్రతి గోశాలకు బీమా సదుపాయం, పశువైద్యులచే ప్రతి 15 రోజులకు వైద్య పరీక్షలు, ప్రత్యేక బీడు భూముల కేటాయింపు వంటి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. "హమ్ గాయ్ భక్షక్ నహీ... గాయ్ రక్షక్ హై" అనే సందేశాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గోవధ ఫ్యాక్టరీలకు ముస్లింల పేర్లు పెట్టి సామాజిక విద్వేషాలను కొందరు మతోన్మాదులు రెచ్చగొట్టడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. అలాంటి ఫ్యాక్టరీలను నిర్వహించే వారు తమ పిల్లల పేర్లతోనే వ్యాపారాలు కొనసాగించాలని సూచిస్తూ, సమాజంలో పరస్పర గౌరవం, బాధ్యతా భావం పెరగాలని హితవు పలికారు. మతాల పేర్లతో విభేదాలు సృష్టించడం కన్నా, భారతీయులుగా ఐక్యంగా నిలబడటమే దేశానికి శ్రేయస్కరమని అన్నారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో ముస్లిం మహనీయుల పాత్రను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ జెండా రూపకల్పనలో కృషి చేసిన సూరయ్య త్యాబ్జీ, "జైహింద్" నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన అదిబ్ హసన్ సఫ్రాని, "క్విట్ ఇండియా" నినాదాన్నిచ్చిన యూసుఫ్ మెహర్ ఆలీ, నేతాజీకి విరాళాలు అందించిన అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మార్ఫాని, వంటి మహనీయుల సేవలు భారత ఐక్యతకు చిరస్మరణీయమని కొనియాడారు. దేశం అనేది కేవలం భూభాగం కాదని, పరస్పర గౌరవం, సహజీవనం, త్యాగాలతో నిర్మితమైన మహోన్నత భావన అని సయ్యద్ సాదిక్ ఆలీ




పేర్కొన్నారు. గోమాత పరిరక్షణతో పాటు భారతీయుల ఐక్యత కోసం అన్ని వర్గాలు కలిసి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజంలో ద్వేషం కన్నా దయ, విభజన కన్నా బంధుత్వం, మతాల మధ్య విభేదాల కన్నా భారతీయత గొప్పదనే సందేశాన్ని ఆయన వ్యాఖ్యలు ప్రతిబింబించాయి. ఈ విలేకరుల సమావేశంలో సయ్యద్ సాదిక్ అలీ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ నజీరుద్దీన్, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యక్షులు మహమ్మద్ ఖలీమ్, సైదా, సుభాని, నిజాంపేట్ కార్యదర్శి మున్నా భాయ్, హబీబ్, ఖమ్మం పట్టణ టూ టౌన్ అధ్యక్షులు అల్లా బకాష్, ఎండి. షఫీ, ఎండి. గులాం నబి, సారధి నగర్ రాజ్యాంగ పరిరక్షణ వేదిక కార్యదర్శి ఎండి గౌస్, ఎండి. ఖుద్రతుల్లా, ఎండి. హాది, ఎండి. కలీము భాయ్, ఎండి. అమ్జద్ పాషా, అల్లాభక్ష్, ఎస్ కె. ఆరిఫ్ న్యాయవాది, తౌసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రసమయి





**బెజ్జంకి, మే27(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో గతరాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దైన వడ్లు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రసమయి మాట్లాడుతూ.... అప్పులుజేసి పంటలు వేసి ఏడాది పాటు చెమటోడ్చుతూ కష్టపడిన రైతుల ఆశలు ఒక్క రాత్రిలోనే నీటిలో కలిసిపోయాయని ఆవేదన చెందారు. వర్షాలకు ధాన్యం పాడైపోతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాక రైతు సమస్యలపై కనీస చిత్తశుద్ధి ప్రభుత్వంపై కనిపించడం లేదన్నారు. అన్నదాత ఆత్మస్థైర్యం కోల్పోయే పరిస్థితులు తీసుకురాకుండా తడిసిన ధాన్యం, మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ప్రతి రైతుకు నష్టపరిహారం అందించడంలో బాధ్యత వహించాలని, రైతు బతికితేనే దేశం బతుకుతుందని, రైతు కష్టాన్ని గౌరవించని ప్రభుత్వాలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రసమయి హెచ్చరించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజయ్య, మాజీ జెడ్పిటిసి కనగండ్ల కవిత తిరుపతి, మాజీ మండలాధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, లింగాల లక్ష్మణ్, ఎలా శేఖర్ బాబు, బండి రమేష్, బాల్ నర్సు, సర్పంచులు శ్రీనివాస్,, మోహన్, ఉప సర్పంచులు, మహేష్, పరశురాం, గ్రామ శాఖ అధ్యక్షుడు మాజీ నరేష్ పటేల్, స్వామి తదితరులు రసమయి వెంట కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# ఈద్గా ల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్




**కరీంనగర్ టౌన్, మే27(ది క్రైమ్ న్యూస్):** ఈదుల్ ఆధా (బక్రీద్) పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు మొదటి రోజు నమాజ్ ఆచరించే ఈద్గాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ తరపున నాయకులు బుధవారం పరిశీలించారు. గురువారం నుండి మూడు రోజుల పాటు (28, 29, 30 తేదీల్లో) ఈ పండుగ జరగనుంది. ఈ సందర్భంగా శాంతినగర్, షహలే నగర్ ఈద్గాల వద్ద ముస్లింలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా తాగునీరు, విద్యుత్ సరఫరా, పార్కింగ్, ప్రథమ చికిత్స కేంద్రాల పనులను జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ మహమ్మద్ తాజోద్దీన్ దగ్గరుండి పర్యవేక్షించారు. నమాజ్ ఆచరించడానికి వచ్చే వారికి అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు నేహాల్ అహ్మద్, లేయిక్ ఖాద్రీ, అబ్దుల్ రహేమాన్, ఎండీ చాంద్, ఆమెర్, జమీలోద్దీన్, ఎండీ హనీఫ్, షాహీనష్, అజీం, జమీల్, సలీం, జమీర్, నూర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేవైఎం స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి



**కరీంనగర్ టౌన్, మే27(ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ యువజన విభాగం (బీజేవైఎం) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా నరెడ్ల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు ,కేంద్రమంత్రి బండి సంజయ్ ,జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి కి, తన నియమకానికి సహకరించిన జిల్లా రాష్ట్ర నాయకులందరికీ ధన్యవాదాలు తెలిపారు. బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తూ,రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యార్థి,నిరుద్యోగ వ్యతిరేక విధానాలను ఎండగడతూ యువత పక్షాన కొట్లాడుతానని,యువతకు బీజేవైఎం పరంగా అండగా ఉంటామన్నారు. నరెడ్ల ప్రవీణ్ రెడ్డిది స్వస్థలం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం చిన్నపాపయ్య పల్లె గ్రామం.గతంలో నరెడ్ల ప్రవీణ్ రెడ్డి ఏబీవీపీ 10 సంవత్సరాలు పూర్తి సమయకార్యకర్తగా, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ ల్లో, ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా పని చేసారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా,భూపాలపల్లి జిల్లా ఇంచార్జ్ గా, మంచిర్యాల అసెంబ్లీ ఇంచార్జ్ గా, వరంగల్ పశ్చిమ ఇంచార్జ్ గా,కరీంనగర్ అసెంబ్లీ మెంబర్షిప్ సహ ఇంచార్జ్ గా, కరీంనగర్ జిల్లా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ ఇంచార్జ్‌గా పని చేసారు.

# సంక్షేమ పథకాలతో మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి





**మానకొండూర్, మే27(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్దిలో నూతన వీవో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి సమాజం అభివృద్ధి చెందేలా మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తూ స్వయం ఉపాధికి అవసరమైన శిక్షణ, ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం మండల కేంద్రంలో వివిధ గ్రామాల లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీడీవో వరలక్ష్మి, తహశీల్దార్ విజయ్ కుమార్, సర్పంచ్ పెంచాల కిషన్ రావు, జిల్లా నాయకులు నందగిరి రవీంద్రచారి, సాయిరి దేవయ్య, కనకం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్.తిరుమల్ రెడ్డి,మండల నాయకులు బుర్ర శ్రీదర్ గౌడ్, మడుపు ప్రేమ్ కుమార్, సహదేవ్, ఇర్ఫాన్, ఎడ్ల శ్రీధర్, రామకృష్ణ, తమిశెట్టి రాజేశ్, కానిగంటి రమేశ్, నాగిశెట్టి రాజయ్య, దూలం దేవేంద్ర, వీరస్వామి వివిధ గ్రామాల నాయకులు తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# స్వామి వివేక్ పటేల్‌ను పరామర్శించిన ఎంపీ రవి చంద్ర



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడి చికిత్స పొందుతున్న ఆకుల స్వామి వివేక్ పటేల్ ను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవి చంద్ర మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్వామి వివేక్ పటేల్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ రవి చంద్ర మాట్లాడుతూ, సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే నాయకులు ఆరోగ్యంగా ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సామాజిక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ బీసీ వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ఆకుల స్వామి వివేక్ పటేల్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సామాజిక పెన్షన్ మంజూరులో సాంకేతిక సమస్యలను సవరించండి: సుగుర్తి జగదీశ్వర చారీ



**తిమ్మాపూర్,మే27(ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇతరులకు అందిస్తున్న సామాజిక పెన్షన్లలో జరుగుతున్న సాంకేతిక సమస్యలపై తగిన చర్యలు చేపట్టాల్సిందిగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా విన్నవించారు. ప్రతినెలా సహకార సంఘాల లబ్ధిదారులు తమ పెన్షన్ కోసం ఎదురు చూస్తుంటే, వృద్ధ దంపతుల్లో పెన్షన్ పొందే భర్త మరణించిన తరువాత భర్త పెన్షన్ ను ఎంపిడివో లాగిన్ ద్వారా భార్యకు వితంతు పెన్షన్లు మంజూరు చేయబడుతందని, వికలాంగుల పెన్షన్, టాడి టాపర్ పెన్షన్ ఇతర రకాల పురుషులు పొందుతున్న పెన్షన్లు ఎంపీడీఓ లాగిన్ ద్వారా బదిలీ కాకపోవడంతో అర్హతగల వితంతువులకు ఏళ్ళు గడుస్తున్నా పెన్షన్ మంజూరు కావడం లేదని పేర్కొన్నారు. ఓఏపి పెన్షన్లకే పరిమితమైన బదిలీ సదుపాయం ఇతర పెన్షన్లకు లేదనందున కొత్త పెన్షన్లు మంజూరయ్యే వరకు,పాత పెన్షన్ బదిలీలు కొనసాగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేసినందున వితంతువులకు మంజూరయ్యే అన్ని రకాల పెన్షన్ల బదిలీ అంశంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నట్లు జగదీశ్వర చారీ లెటర్ లో పేర్కొన్నారు.

# ఆడంబరాలకు పోకుండా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం

**మానసిక వికలాంగుల కేంద్రంలో బాలడి పుట్టినరోజు వేడుకలు**

**పండ్లు, జ్యూస్, బిస్కెట్లు పంపిణీ చేసిన యువ సంకల్ప ఫౌండేషన్**



**సుల్తానాబాద్, మే 27(ది క్రైమ్ న్యూస్):** పుట్టినరోజుల పేరుతో వృథా ఖర్చులు, హంగులు, ఆడంబరాలు చేయకుండా.. మనకు తోచినంతలో ఎదుటి వ్యక్తికి సహాయం చేయడమే నిజమైన మానవత్వమని యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షులు తుమ్మ రాజ్ కుమార్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని మానసిక వికలాంగుల పునర్వాస కేంద్రంలో బుధవారం స్థానిక రంగు లోహిత – విశ్వేశ్వర చారి దంపతుల చిన్న కుమారుడు రిషికేశవ చారి పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కేంద్రంలోని పిల్లలకు పండ్లు, జ్యూస్, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బాలుడి తల్లి లోహిత మాట్లాడుతూ.. తమ కుమారుని పుట్టినరోజును దివ్యాంగ పిల్లల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, ఈ కార్యక్రమానికి సహకరించిన రాజ్ కుమార్ కి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇళ్లలో ఎలాంటి శుభకార్యాలు ఉన్నా, ఈ దివ్యాంగ పిల్లల మధ్య జరుపుకుంటే ఎంతో పుణ్యం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సందర్శించి పిల్లలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గాలపల్లి కుమార్, దేశెట్టి రమేష్, సెంట్రింగ్ ఇంచార్జ్ శ్రీనివాస్, కూకట్ల చంద్రకళతో పాటు కుటుంబ సభ్యులు రంగు రమాదేవి, ఉమారాణి, సరస్వతి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో నియామక పత్రం అందుకున్న అరుణ్ కుమార్, రాహుల్ గాంధీ దిశానిర్దేశం

**జిల్లా ఎస్సీ విభాగాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుతా కొరివి అరుణ్ కుమార్**



**కరీంనగర్ టౌన్, మే27(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షునిగా కొరివి అరుణ్ కుమార్ మరోసారి నియమితులయ్యారు. న్యూఢిల్లీలోని ఏఐసిసి కార్యాలయం ఇందిరా భవన్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల జిల్లా అధ్యక్షుల సమావేశంలో ఈ నియామకం జరిగింది.ఏఐసిసి ఎస్సీ విభాగం జాతీయ అధ్యక్షులు రాజేంద్రపాల్ గౌతమ్, ఎస్సీ విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా కొరివి అరుణ్ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన జిల్లా అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రెండవసారి కరీంనగర్ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షునిగా నియమించిన డా. కవ్వంపల్లి సత్యనారాయణకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం కి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.డా. కవ్వంపల్లి సత్యనారాయణ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కరీంనగర్ జిల్లాలో ఎస్సీ విభాగం అభ్యున్నతికి కృషి చేస్తానని, జిల్లా విభాగాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానంలో నిలుపుతానని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో అందరినీ కలుపుకొని జిల్లా స్థాయి కమిటీలు వేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాటుపడతానని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను పాలక ప్రభుత్వాలు ఆదుకోవాలి

- కార్మిక వర్గ దిక్సూచి ఏఐటీయూసి రాష్ట్ర 4వ మహాసభల లోగో ఆవిష్కరించిన చాడ వెంకటరెడ్డి




**కరీంనగర్ టౌన్, మే27(ది క్రైమ్ న్యూస్):** భారతదేశంలోనే కార్మిక వర్గానికి దిక్సూచిగా నిలిచేందుకు 1920లో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఏఐటీయూసి ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే,మహాసభల ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్ చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏఐటీయూసి తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను పురస్కరించుకొని ఆహ్వాన సంఘం రూపొందించిన లోగో ను ఆహ్వాన సంఘం ప్యాట్రన్ కలవేన శంకర్,ఆహ్వాన సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టేకుమల్ల సమ్మయ్య,కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ లతో కలిసి చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘంగా ఆవిర్భవించిన ఏఐటీయూసీ భారత దేశ స్వాతంత్ర్యం కోసం కార్మిక వర్గాన్ని,ఉద్యోగ వర్గాన్ని ఐక్యం చేసి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదని, సంఘటిత అసంఘటిత రంగాలకు చెందిన కార్మిక వర్గానికి ఆశాజ్యోతి గా నిలిచిందని శ్రమకు తగ్గ ఫలితం కావాలని, పని గంటలు తగ్గించాలని, వేతనాలు పెంచాలని, కనీస వేతనాల కోసం నాటి నుంచి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎంతోమంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపి అనేక చట్టాలు తీసుకువచ్చిన కార్మిక సంఘమ అని,చట్టాలు తీసుకురావడంతో పాటు వారి హక్కులను కూడా కాపాడిన సంఘం ఏఐటీయూసి అన్నారు. ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను,చివరికి సమ్మె చేసే హక్కును కూడా కాలరాయడానికి బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని, నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి కార్పోరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల, కర్షకులంద వ్యతిరేకిగా మారాడని, ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సంస్కరణల పేరుతో రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లుగా చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశాడని విమర్శించారు. కార్మిక వర్గానికే కంచుకోటగా నిలిచే కరీంనగర్ జిల్లాలో సెప్టెంబర్ మాసంలో తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసి నాలుగవ మహాసభలు జరగనున్నాయని, కార్మిక వర్గం భవిష్యత్ కార్యాచరణను రూపొందించు కునేందుకు కరీంనగరే వేదిక అవుతుందని, ఈ మహాసభల విజయవంతం కోసం ఉమ్మడి జిల్లా కార్మిక వర్గం దాని అనుబంధ సంఘాలు చేయాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసి,అకాల వర్షానికి ధాన్యం తడవడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. రైతులు కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చి కోసి ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో పాలక ప్రభుత్వాలు సరైన సమయానికి వాటిని కొనుగోలు చేయడం లేదని,అకాల వర్షాలకు దాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందని చాడ వెంకటరెడ్డి అన్నారు. తీవ్రమైన ఎండలు మండిపోవడం మూలంగా వంద మందికి పైన వడదెబ్బతో మృతి చెందారని, రైతులు ఎండకు ఎండుతూ వర్షానికి నాన్నతో తీవ్రమైన అవస్థలు పడుతున్నారని, ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతుందని గన్ని బ్యాగులు, హమాలీల కొరత ఉండడం మూలంగా ఆలస్యం అవుతుందని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎఫ్.సి.ఐ గోడౌన్ లో నిల్వ ఉంచాలని, మినిమం సపోర్ట్ ప్రైస్ ఇవ్వాలని, రాష్ట్రానికి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు చొరవ చూపాలని, మక్కలు పూర్తిగా కొనుగోలు చేయక డబ్బులు ఇవ్వకపోవడం మూలంగా రైతులు అనేక ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్య స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి ప్రభుత్వం పరిపాలిస్తుందని బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఒకరకంగా, ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను ఒకరకంగా చూస్తూ వివక్షత చూపుతుందని, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే ప్రజలపై పన్నుల భారం బిజెపి ప్రభుత్వం మోపిందని, పెట్రోల్ డీజిల్ ధరలు, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సామాన్యుల పై పెను భారం వేసిందని అన్నారు. కార్పొరేటు పెట్టుబడిదారులకు మొండి బకాయిలు మాఫీ చేస్తూ,సబ్సిడీలు ఇస్తూ వారికి మేలు చేస్తుందని, లక్షల కోట్ల అప్పులు చేసి ప్రజలపై భారం పడే విధంగా బిజెపి పరిపాలన కొనసాగుతుందని వెంకటరెడ్డి విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మహాసభల ప్యాట్రన్ కలవేన శంకర్, ఆహ్వాన సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, టేకుమల్ల సమ్మయ్య, కోశాధికారి కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ఆహ్వాన సంఘం నాయకులు పొనగంటి కేదారి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కాశెట్టి లక్ష్మయ్య, పిట్టల సమ్మయ్య, వెల్దశీడి దామోదర్, పిట్టల శ్రీనివాస్, బెజ్జంకి కాళిదాస్, అల్లేపు రాజు, కేంసారం నర్సయ్య, పి.శ్రీనివాస్, జక్కుల ఆగయ్య, బాగోతం వీరయ్య, ఏం.తిరుపతి, పి.కొమురయ్య, గందే కొమురయ్య, మహేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు చేతిలో వే బిల్లులు.. గోదాం గేటుకు రాజకీయ తాళాలు

- రైతే రాజంటారు.. గేటు దగ్గర గెంటేస్తారు. ● గోదాం గేటుకు కాదు.. రైతు గౌరవానికి తాళం ● కొనుగోలు కేంద్రాలా?.. అధికార పార్టీ కార్యాలయాలా..? ● మొక్కజొన్నలు అమ్ముకోవడానికి ముప్పు తిప్పలు ● ట్రాక్టర్లతో రోడ్డెక్కిన రైతులు ● అండగా నిలిచిన ప్రతిపక్ష నాయకులు




**బ్యూరో,(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద జరిగిన ఘటన రైతుల గుండెల్లో మంట రేపింది. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నను అమ్ముకునేందుకు వే బిల్లులతో ఆశగా వెళ్లిన ఓదెల మండల రైతులకు వే బిల్లులు ఉన్నా కూడా దిగుమతి లేదన్న అధికారుల తీరుతో ఎదురైన అవమానం చూస్తే... “ఇది రైతు ప్రభుత్వం కాదు... రైతును రోడ్డెక్కించే ప్రభుత్వం” అన్న భావన కలగక మానదు. ఓదెల మండలానికి చెందిన రైతులు తమ ట్రాక్టర్లలో మొక్కజొన్నను తీసుకుని కాల్వశ్రీరాంపూర్ వ్యవసాయ మార్కెట్ గోదాంకు చేరుకోగా... అక్కడ కొందరు స్థానిక అధికార పార్టీ రాజకీయ పెద్దల ఒత్తిడితో అధికారులకు ఫోన్‌లు మోగాయట. ఫలితం..? రైతు ట్రాక్టర్లకు స్టాప్ బోర్డు...! గోదాం గేటు దగ్గరే రైతుల ఆశలకు బ్రేక్...! పంటను తూకం వేయాల్సిన కేంద్రం రైతుల సహనాన్ని జోకేస్థితికి చేరింది. “వే బిల్లులు ఉన్నా దిగుమతి లేదు” అన్న అధికారుల తీరుతో ఓపిక నశించిన రైతులు ఒక్కసారిగా మండిపడ్డారు. “పంట పండించేది మేమే... కానీ అమ్ముకోవడానికి కూడా రాజకీయ అనుమతి కావాలా..?” అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్నట్టు ట్రాక్టర్లతో రోడ్డుమీదే తిరుగుబాటు జెండా ఎగరేశారు. “పంట మాది ... నిర్ణయం మీదా..?” అంటూ కాంగ్రెస్ పాలనపై విరుచుకుపడ్డారు. అవమానాన్ని భరించలేని రైతులు తమ ట్రాక్టర్లను శ్రీరాంపూర్ చౌరస్తాలో రోడ్డుపై నిలిపి ధర్నాకు దిగారు. రోడ్డు మీద నిలిచింది ట్రాక్టర్లు కాదు... రైతు ఆవేదన. వినిపించింది హారన్ శబ్దం కాదు... అన్నదాత ఆగ్రహ గర్జన. “రైతు సంక్షేమం” అంటూ సభల్లో గొంతులు చించుకునే నాయకులు... గోదాం గేటు దగ్గర మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు..? అని రైతులు ముక్తకంఠంతో మండిపడ్డారు. “అరికాలకు ముల్లు ఇరిగితే పంటితో తీస్తామన్న వాళ్లు... ఇప్పుడు రైతు గొంతుకే ఉరితాడు వేస్తున్నారా? అంటూ విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న ఓదెల తాజా మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, కాల్వ శ్రీరాంపూర్ తాజా మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి లు రైతుల పక్షాన గర్జించారు. రైతుల కష్టాన్ని అర్థం చేసుకున్న నాయకుల్లా అధికారులను నిలదీశారు. “రైతులు వారం రోజులుగా ఇబ్బందులు పడుతుంటే స్థానిక శాసనసభ్యుడు ఎక్కడ? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రతి గుమ్మం ముందు కనిపించిన నాయకులు ఇప్పుడు గోదాం గేటు దగ్గర మాత్రం కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. యూరియా కోసం రైతు క్యూ... కాలువ నీళ్ల కోసం రైతు క్యూ... ఇప్పుడు పంట అమ్ముకోవడానికి కూడా రైతు క్యూ..! ఇదేనా రైతు ప్రభుత్వం..?” అంటూ గంట రాములు యాదవ్ మండిపడ్డారు. “రైతులు రాజులంటూ పోస్టర్లు వేసుకోవడం సులువు... కానీ గోదాం గేటు దగ్గర రైతును గౌరవించడం చేతకావడం లేదు”, రైతు కడుపు మంట రోడ్డు మీదికి వస్తే కుర్చీలు కూడా కదిలిపోతాయని హెచ్చరించారు. “రైతు చెమటను అడ్డుకునే రాజకీయాలు ఎక్కువ రోజులు నిలవవు” అంటూ రైతులకు అండగా కాల్వ శ్రీరాంపూర్ తాజా మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతి రెడ్డి నిలబడ్డాడు. ధర్నాలో రైతులతో కలిసి అధికారులను ప్రశ్నించారు. రైతు ఓపికను బలహీనతగా భావిస్తే అదే ఓపిక ఒకరోజు ఉద్యమంగా మారుతుందని హెచ్చరించారు. “పంట చేతికొచ్చిన రైతు సంతోషంగా ఉండాలి... కానీ ఈ ప్రభుత్వంలో రైతు గోదాం గేటు దగ్గర అవమానాలు పడుతున్నాడు. పంట కొనలేని పాలకులు... ప్రచారాలు మాత్రం కొండంత చేస్తున్నారు” అంటూ ఎద్దేవా చేశారు. రైతు కష్టాన్ని రాజకీయాల కింద నలిపేస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆగ్రహం చూసి మొత్తం మీద అధికార యంత్రాంగంలో చలనం మొదలైంది. రైతుల ఆందోళన, గంట రాములు యాదవ్ -- వంగల తిరుపతి రెడ్డి ల తీవ్ర ఒత్తిడితో చివరకు అధికారులు వెనక్కి తగ్గారు. ఓదెల రైతుల మొక్కజొన్నను వెంటనే దిగుమతి చేసుకుంటామని హామీ ఇవ్వడంతో మంటలు చల్లారాయి. చివరగా“ తను పండించిన పంట అమ్ముకోవడానికి కూడా ఎర్రటి ఎండల్లో రోడ్డు మీద పోరాడాలా..?” అని రైతులు అడుగుతున్న ప్రశ్నకు మాత్రం సమాధానం అలాగే మిగిలిపోయింది. రైతు ట్రాక్టర్ ను గోదాం గేటు దగ్గర ఆపొచ్చు... కానీ అదే రైతు ఆగ్రహాన్ని ఎవరూ ఆపలేరని కాల్వ శ్రీరాంపూర్ ధర్నా మరోసారి నిరూపించింది.

# సామాజిక పెన్షన్ మంజూరు విధానంలో సాంకేతిక సమస్యలను సవరించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ నాయకుని విన్నపం

**కరీంనగర్ టౌన్, మే27(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పథకంలో వృద్ధ దంపతుల్లో ఒకరు మరణించిన సందర్భంలో తక్షణ సహాయం అందించే విధానంలో సాంకేతిక మార్పులు చేయవలసిందిగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి రాష్ట్ర ప్రభుత్వానికి బుధవారం లెటర్ ద్వారా విన్నవించారు. రాష్ట్రం లో అమలు చేస్తున్న వివిధ రకాలైన సామాజిక పెన్షన్ లకు సంబంధించి, వృద్ధులు, విధవులు, వికలాంగులు, ఇతరులకు అందిస్తున్న పెన్షన్లలో జరుగుతున్న సాంకేతిక పొరపాటును ప్రభుత్వం దృష్టిలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టవలసిందిగా లెటర్ ద్వారా కోరుతున్నట్లు పేర్కొన్నారు.ముఖ్యంగా సహకార సంఘాలకు సంబంధించిన లబ్ధిదారులు ప్రతి నెలా తమ పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారు.ప్రధాన అంశం ఏమిటంటే, వృద్ధ దంపతుల్లో ఒకరు మరణించినప్పుడు, ఉదాహరణకు భర్త మరణించిన సందర్భంలో, భార్య అర్హత మేరకు తక్షణమే పెన్షన్ పొందే హక్కు కలిగి ఉంటుంది. ప్రస్తుతం భర్త ఓఏపీ (వృద్ధాప్య పెన్షన్) పొందుతున్నట్లయితే, ఎంపిడివో లాగిన్ ద్వారా “ట్రాన్స్ఫర్ ఆఫ్ పెన్షన్ ఆప్షన్ ” ద్వారా విడో పెన్షన్ భార్యకు మంజూరు చేయబడుతోంది. అయితే వికలాంగుల పెన్షన్, టాడి టాపర్ పెన్షన్ మరియు ఇతర రకాల పెన్షన్లు (పురుషులు పొందుతున్న ఇతర పెన్షన్లు) ఎంపీడీఓ లాగిన్ ద్వారా బదిలీ కావడం లేదు. దీనివల్ల పెన్షన్ పొందే భర్త మరణించిన మహిళలకు ఏళ్ళు సంవత్సరాలు గడుస్తున్నా కూడా పెన్షన్ మంజూరు కావడం లేదు.కొత్త పెన్షన్లు మంజూరు అయ్యే వరకు, పాత పెన్షన్ బదిలీ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని అలాగే ప్రస్తుతం బదిలీ సదుపాయం కేవలం ఓఏపి పెన్షన్లకే పరిమితమై ఉండటంతో, ఇతర రకాల పెన్షన్లకు బదిలీ జరగడం లేదని లెటర్ లో పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు తెలియజేయబడింది. కాబట్టి భర్త చనిపోయిన మహిళలకు మంజూరు చేయబడే అన్ని రకాల పెన్షన్ల బదిలీ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం గమనించి, అర్హులైన లబ్ధిదారులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నట్లు లెటర్ లో పేర్కొన్నారు.



# అనధికార చెత్త సేకరణ దారులకు అవగాహన కార్యక్రమం





**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ కమిషనర్ కే. రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారిత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హాలియా మున్సిపాలిటీ పరిధిలో అనధికార చెత్త సేకరణ దారులను గుర్తించి వారికి ఆయుష్మాన్ భారత్ గుర్తింపు కార్డులు, వృత్తిపరమైన భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ రవికుమార్ మాట్లాడుతూ చెత్త సేకరణ దారులకు “నమస్తే” పథకం ప్రయోజనాలు, ఆరోగ్య భద్రత, పని సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# జిల్లా ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం...

- ఆర్థోపెడిక్ విభాగం వైద్యుల ప్రతిభ - అత్యాధునిక పద్ధతిలో విరిగిన ఎముకకు ప్లేట్లు, స్క్రూల అమరిక



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో క్లిష్టమైన భుజం శస్త్రచికిత్సను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. జిల్లా కేంద్రానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి రోడ్డు ప్రమాదంలో కుడి భుజం ఎముక విరిగి తీవ్రమైన నొప్పితో జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు వెంటనే స్పందించి రోగిని పరీక్షించగా, ఎముక విరిగినట్లు ఎక్స్ రే ద్వారా నిర్ధారణ అయింది. అయితే, రోగికి 120 కేజీల బరువు ఉండటం వల్ల మరియు గతంలో మత్తు ఇచ్చేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో వైద్యులకు ఈ ఆపరేషన్ సవాలుగా మారింది. ఈ క్లిష్ట సమయంలో రోగి భద్రత దృష్ట్యా, అల్ట్రాసౌండ్ మెషిన్ సహాయంతో లోకల్ అనస్థీషియా బ్లాక్ ఇచ్చేందుకు నిష్ణాతులైన వైద్యుడు మహేశ్వర్ రెడ్డిని ప్రత్యేకంగా పిలిపించారు. ఆ తర్వాత సీనియర్ ఆర్థోపెడిక్ డాక్టర్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ వినయ్, డాక్టర్ మేఘనలతో కూడిన బృందం సుదీర్ఘ శ్రమతో ఓఆరఐఎఫ్ విత్ సీసీ స్క్రూ ప్లేటింగ్ అనే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సలో విరిగిన ఎముక భాగాలను పూర్తిగా సరిచేసి, ప్రత్యేకమైన ప్లేట్లు, స్క్రూల సహాయంతో ఎముక కదలకుండా స్థిరపరిచారు. ఈ ప్రక్రియలో అనస్థీషియా వైద్యులు మహేశ్వర్ రెడ్డి, భవాని, స్వాతి కీలక పాత్ర పోషించారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్య బృందాన్ని, ఓటీ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ కొండ శ్రీధర్ అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇటువంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం పట్ల రోగి బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

# బక్రీద్ నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై కమిషనర్ ప్రత్యేక తనిఖీ







**నల్గొండ, ప్రతినిధి(ది క్రైమ్ న్యూస్): మే 27:** హాలియా మున్సిపాలిటీ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి ఉదయం 5:00 గంటలకు పారిశుధ్య సిబ్బంది హాజరును పరిశీలించి, వారికి తగు సూచనలు అందించారు. అనంతరం మెయిన్ రోడ్డుతో పాటు హాలియాలోని పలు వార్డులలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని 1వ వార్డులోని ఈద్గా ప్రాంతంలో పారిశుధ్య సిబ్బంది చేపట్టిన పరిసరాల శుభ్రత కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినాల్సిన సూపర్ ఫుడ్స్ ఇవే..!



మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ తప్పనిసరి. అయితే ఆ బ్రేక్‌ఫాస్ట్ ఆరోగ్యకరమైనది అయితే మరింత మంచిది. పౌష్టికాహారం దీర్ఘకాలం శక్తిని అందిస్తుంది. గంటల తరబడి మిమ్మల్ని పూర్తి శక్తితో ఉంచుతుంది. మంచి ఆహారం సాధారణంగా ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సూక్ష్మపోషకాలను కలిగి ఉంటుంది. అందుకే ఉదయం ఖాళీ కడుపుతో తీసుకునే ఆహారం, పానీయాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మీరు మీ కడుపు, ప్రేగు, మొత్తం జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే.. ఉదయం ఖాళీ కడుపుతో ఎలాంటి ఆహారం తినాలో కొన్ని విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.. ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, మరియు యాంటీఆక్సిడెంట్లు అవసరమైనంత మేర ఉన్న అరటిపండ్లు మంచి బ్రేక్‌ఫాస్ట్‌గా చెప్పవచ్చు. ఉదయాన్నే రెండు అరటిపండ్లు తినడం వల్ల మీ రోజును అదనపు శక్తితో ప్రారంభించవచ్చు. బ్లడ్ షుగర్ తక్కువగా ఉన్నప్పుడు అరటిపండ్లలోని కార్బోహైడ్రేట్లు ఎనర్జీ బూస్టర్‌గా పనిచేస్తాయి. అదనంగా, అరటిపండ్లలో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. ఇది సెరోటోనిన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. సెరోటోనిన్ మనల్ని రిలాక్స్‌గా, సంతోషంగా ఉండేలా చేస్తుంది. కాబట్టి అల్పాహారానికి ముందు అరటిపండు తింటే మంచిదంటున్నారు నిపుణులు. ఖర్జూరం మీ రోజువారీ ఆహారంలో ఆరోగ్యకరమైన స్వీటుగా చెప్పవచ్చు. సరైన ఆరోగ్యాన్ని పొందడంలో సహాయపడే అన్ని రకాల పోషకాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. ఖర్జూరాలలో కార్బోహైడ్రేట్లు, డైటరీ ఫైబర్, ప్రోటీన్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, కాల్షియం, సోడియం మొదలైన ఖనిజాలు, విటమిన్లు, దీ1, దీ2, సమృద్ధిగా ఉంటాయి. మీ రోజువారీ ఆహారంలో ఖర్జూరాలను చేర్చుకోవడం వల్ల ఫ్రీ రాడికల్ డ్యామేజ్‌ను నివారించవచ్చు. కొరోనరీ హార్ట్ డిసీజ్, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ ఎ, బి,సి, ఇ, కె, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, జింక్, ఫైబర్, ప్రోటీన్ వంటి పోషకాలు ఆపిల్స్‌లో పుష్కలంగా లభిస్తాయి. ఉదయాన్నే ఖాళీ కడుపుతో యాపిల్‌ను తింటే ఎక్కువ లాభాలు పొందొచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అందులో ఉండే విటమిన్ ని శరీరం త్వరగా గ్రహిస్తుంది. రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది. అధిక రక్తపోటుతో బాధ పడే వారు ఖాళీ కడుపుతో ఆపిల్ తింటే చాలా మేలని అంటున్నారు. గుండె జబ్బులు వచ్చే రిస్క్ సైతం తగ్గుతుంది. అంతేకాదు, ఖాళీ కడుపుతో యాపిల్‌ను తింటే మలబద్ధకం సమస్య దూరం అవుతుంది. శరీరంలో వాపులు తగ్గుతాయి. మెదడు చురుగ్గా పని చేస్తుంది. శరీరం రోజంతా యాక్టివ్‌గానూ ఉంటుంది. బాదంపప్పులో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. బాదంపప్పును సలాడ్ రూపంలోనూ, పచ్చిగా కూడా తినవచ్చు. లేదంటే ప్రోటీన్ షేక్స్‌లో యాడ్ చేసుకున్న సరే. మీరు కాఫీకి ప్రత్యామ్నాయంగా బాదం పాలను కూడా తాగవచ్చు. విటమిన్, ప్రోటీన్, ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్, మాంగనీస్, ఫైబర్‌తో నిండిన బాదం మీకు బెస్ట్ బ్రేక్‌ఫాస్ట్ అవుతుంది. కానీ వాటిని రాత్రంతా నానబెట్టిన తర్వాత తినటం మంచిది. గుడ్లు సహజంగా లభించే ఇతర ఆహారాల కంటే ఎక్కువ ప్రోటీన్‌ను కలిగి ఉంటాయి. ఉదయాన్నే గుడ్లు తినటం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీంతో అతిగా తినకుండా ఉంటారు. కాబట్టి బరువు తగ్గేందుకు ఇదొక గుడ్ ఆప్షన్. గుడ్లలో ఐరన్, విటమిన్ డి, పొటాషియం, జింక్ ఉంటాయి. ఇవి మీ శక్తి స్థాయిలను పెంచుతాయి. ముఖ్య విషయం ఏంటంటే.. వీటిని మీరు ప్రయత్నించేముందు సంబంధిత నిపుణుల సలహాలను పాటించవలసిందిగా మనవి. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే.



# ఆరోగ్యమే కాదు అందానికీ బొప్పాయి భేష్ అంటున్న నిపుణులు



సాధారణంగా ప్రకృతి ప్రసాదించే అన్ని పండ్లూ ఆరోగ్యానికి మంచివే. రోజుకి ఒక్క యాపిల్ పండు తింటే డాక్టర్ దగ్గరకు వెళ్లే పనుండదు అంటారు. ఒక్క యాపిల్ మాత్రమే కాదు. ప్రకృతిలో లభించే పళ్లలో ఎన్నో ఔషధ గుణాలుంటాయి. అవి మనుషులకే కాదు, పశుపక్ష్యాదులకు కూడా మంచి ఆరోగ్యాన్నిస్తాయి. బొప్పాయితో ఆరోగ్యం మాత్రమే కాదండోయ్.. అందానికి కూడా బొప్పాయి నెంబర్ 1 గా పనిచేస్తుందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ప్రస్తుతం మనం బొప్పాయి వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలగురించి తెలుసుకుందాం. బాగా పండిన బొప్పాయి చర్మం, జుట్టు, రోగనిరోధక వ్యవస్థ మొత్తానికి మేలు చేస్తుంది. మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సాయపడుతుంది. అలాగే కొన్ని సాధారణ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. బొప్పాయి పండులో మీ చర్మాన్ని కాంతివంతంగా మార్చే శక్తి ఉంది. అందుకే బొప్పాయి పండును ఫేస్ వాష్, ఫేస్ క్రీమ్, ఫేస్ ప్యాక్, బాడీ లోషన్ వంటి చర్మ సంబంధిత ఉత్పత్తులలో ఉపయోగిస్తారు. విటమిన్లు, ఖనిజాలు, ఎంజైమ్‌లు బొప్పాయిలో పుష్కలంగా ఉంటాయి. విటమిన్ సి అధికంగా ఉంటుంది. బొప్పాయి మన శరీరంలోని అన్ని అవయవాలకు జీవితంలోని అన్ని దశలలో ప్రయోజనకరంగా ఉంటుందని ఎన్నో అధ్యయనాలు పేర్కొన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. 2013లో చేసిన ఓ అధ్యయనం ప్రకారం, విటమిన్ ఎ, బి, సి అధికంగా ఉండే బొప్పాయి మనిషి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బొప్పాయి ప్రోటీయోలైటిక్ ఎంజైమ్‌లను, పపైన్, చైమోపాపైన్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీవైరల్ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. ఇవి కడుపులో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. పపైన్ ఎంజైమ్‌లో ప్రొటీన్ కరిగిపోయే గుణాలు ఉన్నాయి, ఇవి మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. డెడ్ స్కిన్ సెల్స్ ను బొప్పాయి క్లియర్ చేస్తుంది. బొప్పాయిలో లైకోపీన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ముఖం ముడుతలను తగ్గించడంలో సహాయ పడతాయి. 2017 అధ్యయనం ప్రకారం, బొప్పాయిలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్ డ్యామేజ్‌ని తగ్గించడంలో సహాయపడతాయి. చర్మం మృదువుగా, కాంతివంతంగా, యవ్వనంగా ఉంచడంలో ఉపయోగపడతాయి. బొప్పాయి.. చర్మంపై కాలిన గాయాలు ఇతర చర్మ వ్యాధులకు సహజ నివారణిగా పనిచేస్తుంది. బొప్పాయి చర్మానికి మంచి మాయిశ్చరైజర్ కూడా. పొడిబారిన చర్మానికి తిరిగి సహజ తేమను తిరిగి తేవడంలో సహాయపడుతుంది. బొప్పాయి గుజ్జును మీ చర్మంపై క్రమం తప్పకుండా పూయడం వల్ల చర్మం మృదువుగా మారుతుంది. దాని సహజ కాంతిని తిరిగి తీసుకురావడానికి సహాయ పడుతుంది. బొప్పాయి గుజ్జు మీ ముఖానికి సహజ బ్లీచ్‌లాగా పనిచేస్తుంది. బొప్పాయి మీ చర్మపు టాన్ వదిలించు కోవడానికి కూడా సహాయపడుతుంది. ఇందులోని పాపైన్ ఎంజైమ్ మొటిమల మచ్చలు లేదా నల్లబడిన మోచేతులు, మోకాళ్ల వంటి ముదురు చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

## ప్రభుత్వాన్ని విమర్శించడం మాని అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్,మే27(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం సదాశివపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మహిళా సంఘాల సభ్యులకు చీరలను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ....గత పదేళ్లలో వ్యవసాయ రంగాన్ని పట్టించుకోని ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల్లో అయోమయం సృష్టించే ప్రయత్నాన్ని చేస్తున్నాయని విమర్శిస్తూ రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటుపడుతున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమంటూ ప్రశ్నించారు.ధాన్యానికి సరైన ధర లభించేలా కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నామని,అపోహలు వీడి కొనుగోళ్లలో సమస్యలెదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులను కోరుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం మాని అభివృద్ధికి సహకరించాలని ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే సూచించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఉప కమిషనర్ వేణుమాధవ్, స్థానిక కార్పొరేటర్ ఆకుల నందిని, పార్టీ డివిజన్ అధ్యక్షుడు బండి మల్లేశం, డిసిసి ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, ఏనుగు చుక్కారెడ్డి, రామిడి తిరుపతి, సింగిరెడ్డి, మల్లారెడ్డి ఎస్ సత్తయ్య, నాయకులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నిరాశ్రయులైన కుటుంబాలను ఆదుకుంటాం: ఎమ్మెల్యే కవ్వంపల్లి



**గన్నేరువరం,మే27(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరంతో పాటు బెజ్జంకి మండలాల్లోని గ్రామాల్లో అకాల వర్షాలతో దెబ్బతిన్న ఇండ్లను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం పరిశీలించి బాధితులను పరామర్శించారు. కల్లేపల్లిలో కప్పుకొట్టుకు పోయిన ప్రభుత్వ పాఠశాలను, ఇండ్లను సందర్శించి పాఠశాలను సందర్శించని ప్రధానోపాధ్యాయుడిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందజేస్తామని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. అనంతరం మాదాపూర్లోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మక్కలను వెంటనే కొనుగోలు చేసి గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అలువాల కోటి, కొమ్మెర రవీందర్ రెడ్డి, పులి కృష్ణ, లింగాల శ్రీనివాస్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, గూడెల్లి శ్రీకాంత్, కల్లెపల్లి ఆయా గ్రామాల పార్టీ నాయకులు తదితరులు ఎమ్మెల్యే వెంట సందర్శనలో పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ కింద సుందరికరణ పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి






**నల్గొండ ప్రతినిధి, మే 27 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లైఓవర్ కింద చేపడుతున్న సుందరికరణ మరియు పార్క్ నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, పార్క్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులతో పాటు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఫ్లైఓవర్ అండర్ గ్రౌండ్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్ది పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పట్టణ సౌందర్యాన్ని పెంపొందించే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజలకు విశ్రాంతి వాతావరణం కల్పించేలా పార్క్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత ప్రజాపాలన కార్యక్రమంలో అవగాహన




**నల్గొండ ప్రతినిధి, మే 27 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా "బాల్య వివాహాలు -- చట్టరీత్యా నేరం" అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1, 2, 3, 9 వార్డులను కలిపి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 2వ వార్డు కౌన్సిలర్ నకిరేకంటి అన్నపూర్ణ--సైదులు, 9వ వార్డు కౌన్సిలర్ చెరువుపల్లి ముత్యాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును, వారి ప్రాథమిక హక్కులను పూర్తిగా దెబ్బతీస్తాయని తెలిపారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల అమ్మాయిలు చదువుకు దూరమై తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారని పేర్కొన్నారు. బాల్య వివాహాలు శారీరక, మానసిక ఎదుగుదలను అడ్డుకొని పేదరికాన్ని మరింత పెంచుతాయని, వాటిని అరికట్టడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని గుర్తుచేశారు. మైనర్ బాలికలు, బాలురకు వివాహాలు జరిపించకూడదని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మురళి అయ్య, సత్యనారాయణ రాజు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు అధికారులు, బుక్ కీపర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్టేట్ లెవెల్ డాన్స్ కాంపిటీషన్లో సెకండ్ ప్రైస్ సాధించిన న్యూ టాలెంట్ డాన్స్ అకాడమీ చిన్నారులు




**భూపాలపల్లి/కాటారం/మే -27:(ది క్రైమ్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం న్యూ టాలెంట్ డ్యాన్స్ అకాడమీ పిల్లలు స్టేట్ లెవెల్ డాన్స్ కాంపిటీషన్లో సెకండ్ ప్రైజ్ సాధించారు. ఈ డ్యాన్స్ ప్రోగ్రామ్ను హనుమకొండ లో ప్రశాంత్ డ్యాన్స్ అకాడమీలో నిర్వహించారు. అతిథిగా సినీ ఫిలిం కొరియోగ్రాఫర్ మాస్టర్ ప్రశాంత్ హాజరయ్యారు. స్టేట్ లెవల్ డాన్స్ కాంపిటీషన్ లో జూనియర్ విభాగం లో వెస్ట్రన్ డాన్స్ సెకండ్ ప్రైస్ గెలుపొందిన శనిగరపు రంజిత్ మరియు జూనియర్ విభాగంలో ఫోక్ డాన్స్ డ్యూయట్ రౌండ్ లో సెకండ్ ప్రైస్ గెలుపొందిన రామిల్ల నాగ శ్రీనిధి, అన్విక లకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినిమా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సతీమణి సుమలత చేతుల మీదుగా బహుమతులను అందజేసారు. అనంతరం న్యూ టాలెంట్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ రామిల్ల రాకేష్ మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రశాంత్ మాస్టర్ కు, ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుమలత మేడం కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లారీ ఢీకొని బైక్ నడుపుతున్న వ్యక్తి దుర్మరణం.. మరొకరికి గాయాలు




**సుల్తానాబాద్, మే 27(ది క్రైమ్ న్యూస్):** అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ బైక్‌ను వెనుక నుండి ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడిన విషాద సంఘటన సుల్తానాబాద్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన కోట నిరంజన్ రెడ్డి, నాంసానిపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి రాజుతో కలిసి తన బైక్‌పై కరీంనగర్ వైపు వెళ్తున్నారు. వీరి బైక్ సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు చేరుకోగానే.. కరీంనగర్ వైపు బూడిద లోడుతో వెళ్తున్న ఒక టిప్పర్ లారీ డ్రైవర్ తన వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను వెనుక నుండి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడిపోగా, కోట నిరంజన్ రెడ్డి నడుము పైనుంచి లారీ టైర్ వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న పోతుగంటి రాజుకు తృటిలో ప్రాణాపాయం తప్పి, స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి భార్య కోట అపర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుల్తానాబాద్ ఎస్ఐ చంద్రకుమార్ కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై దర్యాప్తు జరుపుతున్నారు.

# విశ్వజి



## ఈ నూనె వాడితే నవ యవ్వనం, సౌందర్యం డబుల్!

చాలామంది నేటి రోజుల్లో అందం కోసం చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. రకరకాల మాయిశ్చరైజింగ్ ప్రొడక్ట్స్ ఉపయోగిస్తున్నారు. అంతే కాదు చాలా యాంటీ ఏజింగ్ క్రీములను కూడా ఉపయోగిస్తున్నారు. ముఖం మీద ముడతలు రాకుండా, అకాల వృద్ధాప్యం రాకుండా చాలా జాగ్రత్తలే తీసుకుంటున్నారు. అయితే వృద్ధాప్యం త్వరగా రాకుండా నివారించటం కోసం కొన్ని రకాల ఆయిల్స్ వాడుతున్నారు. అటువంటి వాటిలో ఒక బెస్ట్ ఆయిల్ గురించి ఈ రోజు మనం తెలుసుకుందాం. గంధపు నూనెతో చాలా లాభాలు గంధపు నూనె యాంటీ ఏజింగ్ ఆయిల్ గా చాలా బాగా పని చేస్తుంది. గంధపుచెట్టు నుండి గంధపు నూనెను తయారు చేస్తారు. గంధపు చెక్కల నుండి తయారయ్యే ఈ సుగంధ భరితమైన గంధపు నూనె మన చర్మ ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తుంది.. ఈ నూనె అన్ని శారీరక, మానసిక రుగ్మతల యొక్క చికిత్సల కోసం ఆయుర్వేద ఔషధాలలో ఉపయోగిస్తారు. గంధపు నూనెను మానసికంగా మనం రిలాక్స్ అవ్వటానికి ఉపయోగిస్తారు. %ూశ్రీంశీ =ఘు‌ం% సినిమానే అనుకున్నాం..పాటలు కూడా ఇంత దారుణంగా ఉన్నాయ్ ఏంటీ బ్రో..! గంధపు నూనె సహజమైన మాయిశ్చరైజర్ గంధపు నూనె ఒక అద్భుతమైన సహజమైన మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. గంధపు నూనెలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది శరీరంపై వచ్చే రాష్ మరియు వాపు వంటి సమస్యలను నివారిస్తుంది. ఇది శరీరాన్ని డీహైడ్రేట్ గా ఉంచుతుంది.అన్నిటికంటే ముఖ్యంగా గంధపు నూనెలో ఉంటే యాంటీ ఆక్సిడెంట్లు యాంటీ ఏజింగ్ లక్షణాలు త్వరగా రాకుండా కాపాడతాయి. చర్మానికి, జుట్టుకు బెస్ట్ గంధం నూనె గంధపు నూనెలో యాంటీ బ్యాక్టీరియల్ తో పాటు యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇవి మన ముఖంపై వచ్చే మొటిమలను నయం చేయడానికి చర్మం పై ఉన్న మచ్చలు, మరకలను తొలగించడానికి ఉపయోగపడతాయి. గంధపు నూనెలో ఆస్ట్రింజెంట్ గుణాలు ఉంటాయి. ఇవి చర్మ దృఢత్వాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడతాయి. చర్మానికి, జుట్టుకి, ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయడానికి మాత్రమే కాకుండా దీనిని అందం ఇనుమడింప చేయడానికి కూడా ఉపయోగిస్తారు. %ూశీషవతీవస దీఎ% గంధపు నూనెతో ఈ సమస్యలకు పరిష్కారం గంధపు నూనెతో ఎగ్జిమా, సోరియాసిస్ వంటి అనేక చర్మ సంబంధిత సమస్యలు తగ్గుతాయి . ఇది చర్మం యొక్క అకాల వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. త్వరగా ముసలితనం రాకుండా చేస్తుంది . గంధపు నూనెను రెగ్యులర్ గా ఉపయోగించడం వల్ల స్కిన్ టోన్ మెరుగుపడుతుంది . కాబట్టి అనేక సమస్యలకు గంధపు నూనె చక్కని పరిష్కారం. వాడే ముందు. కాస్త చేతికి రాసుకుని టెస్ట్ చేసుకున్నాకే మీ స్కిన్ కు సరిపడితేనే వాడండి.

## లిచీ.. ఆరోగ్యానికి మాలచ్చి: తిన్న కొద్దీ తిన బుద్ధవుతుందండి



లిచీ.. వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఎన్నో ఉన్నాయి. ఇందులో పీచు పుష్కలంగా ఉంటుంది. సక్రియ జీర్ణవ్యవస్థకు ఎంతగానో మేలు చేస్తుంది. ఇది ప్రేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఇందులో విటమిన్ సీ అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెరుగుతుంది. ఈ వర్షాకాలంలో వచ్చే ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తాయి. ఫైబర్ ఆరోగ్యకరమైన జీర్ణక్రియకు చాలా అవసరం. ఈ పండులో నీరు, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. తక్కువ కేలరీలు, అధిక నీటి శాతం ఉండటం వల్ల బరువు తగ్గడానికి లిచీ తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మం పాలిపోవడాన్ని తగ్గిస్తాయి. అలాగే- అధిక నీటి శాతం.. శరీరాన్ని హైడ్రేట్ ఉంచుతుంది. ఫలితంగా- చర్మం కాంతివంతంగా ఉంటుంది. లిచీలోని విటమిన్ సీ.. మన శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయపడుతుంది. ఇది చర్మాన్ని దృఢంగా, మృదువుగా, కాంతివంతంగా ఉంచుతుంది. కొల్లాజెన్ చర్మ ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. లీచీలో ఉండే విటమిన్లు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. మంటను తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని పెంపొందించగలవు. ఇది గుండె ఆరోగ్యానికి ఎంతగానో మంచిది. పొటాషియం సమృద్ధిగా ఉండే లీచీ వంటి పండ్లు శరీరంలోని సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తాయి. ఇది రక్తపోటును ఆరోగ్యకరమైన స్థాయిలో ఉంచడానికి సహాయపడుతుంది. లిచీలో కాపర్, ఐరన్ అధికం. ఇవి మన శరీరంలో ఉండే ఎర్ర రక్త కణాలు ఉత్పత్తి చెందడానికి సహాయపడతాయి. రక్త ప్రసరణను మరింత మెరుగుపరుస్తుంది. అధిక పొటాషియం, తక్కువ సోడియం ఉండటం వల్ల రక్తపోటును అదుపులో ఉంటుంది. హైబీపీ ఉన్న వాళ్లు దీన్ని తీసుకోవడం వల్ల చక్కటి ఫలితాలు ఉంటాయి. ఐరన్, కాపర్, కాల్షియం, ఇతర ఖనిజాలు అధికంగా ఉండటం వల్ల లిచీ.. ఎముకలను ధృడంగా ఉంచగలుగుతుంది. వయస్సు మీద పడుతూ వస్తుండటం వల్ల సహజంగానే ఎముకలు పెళుసుగా మారుతుంటాయి. అలాంటి పరిస్థితిని నివారించడంలో సహాయపడుతుంది లిచీ ఫ్రూట్. ఈ పోషకాలు ఎముకలను దృఢంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి వల్ల కణాలకు కలిగే నష్టాన్ని తగ్గిస్తాయి. ఇది సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందించే అద్భుతమైన ఔషధంగా పని చేస్తుంది. పులుపు, తీపి, వగరు వంటి రుచులు ఉంటాయి లిచీలో. తినడానికీ బాగుంటుంది.

## హీరో, హీరోయిన్స్ సీక్రెట్‌గా తినే బ్రేక్ ఫాస్ట్ ఇదే!



చద్దన్నం.. ఈ పేరు వింటేనే చాలా మందికి నోరూరిపోతుంది. పల్లెటూర్లలో ప్రతి ఒక్కరికీ చద్దన్నం సుపరిచితమే. రాత్రి మిగిలిన అన్నాన్ని నీళ్లలో లేదా పెరుగులో నానబెట్టి ఉదయాన్నే తినడాన్ని చద్దన్నం అంటారు. దీన్ని పేదవాడి ఆహారంగా చాలా మంది భావిస్తారు. కానీ చద్దన్నంలో పోషకాలు అధికంగా ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని ఇప్పుడు సినీ నటీనటులు సైతం ఉదయాన్నే తింటున్నారు. జగపతిబాబు, సమంత, నిధి అగర్వాల్‌తో సహా పలువురు ప్రముఖులు కొన్ని సందర్భాల్లో వారే స్వయంగా వెల్లడించారు. చద్దన్నం తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. చద్దన్నంలో పోషకాలు: చద్దన్నంలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా, ఇది విటమిన్ బి12 కు గొప్ప మూలం. దీనిలో విటమిన్ బి, ఐరన్, పొటాషియం , కాల్షియం వంటి ఖనిజాలను కలిగి ఉంటుంది. అంతేకాకుండా, చద్దన్నంలో ప్రోబయోటిక్స్ కూడా ఉంటాయి, ఇవి జీర్ణక్రియకు సహాయపడతాయి. చద్దన్నం తినడం వల్ల కలిగే కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు: %=వషీఎవఅవస ఖీశీ్‌శీబ% "ఈ ఆహారాలతో క్యాన్సర్ రిస్క్.. తినటం మానేయండి!" చద్దన్నంలో ఉండే ప్రోబయోటిక్స్ జీర్ణక్రియకు సహాయపడతాయి. ఇది మలబద్ధకం , ఇతర జీర్ణ సంబంధిత సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. దీనిలో కార్బోహైడ్రేట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఇది రోజంతా చురుకుగా ఉండటానికి సహాయపడుతుంది. చద్దన్నం శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. ఇది వేసవిలో వడదెబ్బను నివారించడానికి సహాయపడుతుంది. చద్దన్నంలో ఉండే పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. ఇది వివిధ రకాల వ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. %ూశీషవతీవస దీఎ% చద్దన్నంలో కాల్షియం పుష్కలంగా ఉంటుంది, ఇది ఎముకలను బలపరుస్తుంది. ఇది బోలు ఎముకల వ్యాధిని నివారించడానికి సహాయపడుతుంది. దీనిలోని పొటాషియం ఉంటుంది, ఇది రక్తపోటును నియంత్రించడానికి సహాయపడుతుంది. చద్దన్నంలో కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దీనిలో ఉండే కాల్షియం ఎముకలను బలపరుస్తుంది. జుట్టుకు పోషణను అందిస్తుంది , దానిని బలపరుస్తుంది. చద్దన్నం ఎలా తయారవుతుంది? రాత్రి వండిన అన్నాన్ని నీటిలో లేదా పెరుగులో నానబెట్టి ఉదయాన్నే తినడాన్ని చద్దన్నం అంటారు. ఇలా నానబెట్టడం వల్ల అన్నంలో కొన్ని మార్పులు జరుగుతాయి, ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. దీనిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం మంచిది. మీరు దీన్ని పెరుగుతో లేదా నీళ్లతో కలిపి తినవచ్చు. మీరు కావాలంటే కొంచెం ఉప్పు మరియు ఉల్లిపాయ కూడా కలుపుకోవచ్చు.

## మంట పెడుతున్న మూత్రం.. క్యాన్సర్ లక్షణామే?

ప్రతి ఏటా ఫిబ్రవరి 4న వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించబడుతుంది. ప్రజల్లో క్యాన్సర్ గురించి అవగాహన కల్పించడం, ఈ ప్రాణాంతక వ్యాధితో పోరాడటానికి ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలను బలపేతం చేయడం దీని వెనుక ఉన్న ఉద్దేశం. చెడు ఆహారపు అలవాట్లు చెడు జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ బారిన పడుతున్నవారి సంఖ్య భారీగా పెరుగుతుంది. ఈ ప్రాణాంతక వ్యాధిని ప్రారంభంలోనే గుర్తించగలిగితే దీనిని విజయవంతంగా జయించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు కోల్పోక తప్పదు.అయితే ప్రారంభ దశలోనే క్యాన్సర్ లక్షణాలను గుర్తుపట్టడం అంత ఈజీ కాదు. ఎందుకంటే 99 శాతంమందికి అవి క్యాన్సర్ లక్షణాలు అని తెలియదు. క్యాన్సర్ వస్తే కనిపించే లక్షణాలు ఇవే: బరువు తగ్గిపోవడం అమెరికన్ క్యాన్సర్ సొసైటీ తెలిపిన వివరాల ప్రకారం..క్యాన్సర్ సోకినవారిలో చాలామంది వేగంగా బరువు తగ్గిపోతుంటారు.పాంక్రియాస్, కడుపు, ఊపిరితిత్తులు, అన్న వాహిక క్యాన్సర్ లు వచ్చినప్పుడు ఇలా జరుగుతుంటది. "ఏప్రిల్ లో ఏనుగు కుంభస్థలాన్ని బద్దలు కొట్టే రాశులవారు వీరేనన్న శని!" తరచూ జ్వరం క్యాన్సర్ రోగుల్లో జ్వరం అనేది సాధారణ లక్షణం. క్యానర్స్ పుట్టిన దగ్గర నుంచి ఇతర అవయువాలకు వ్యాప్తి చెందేటప్పుడు జ్వరం వస్తుంది. క్యాన్సర్ లక్షణాల్లో అలసట కూడా ఒకటి. విశ్రాంతి తీసుకున్నా కూడా రోగులు అలసట నుంచి బయటపడలేరు. లుకేమియా వంటి కొన్ని క్యాన్సర్ లలో అలసటే తొలి లక్షణం. పెద్ద పేగు లేదా కడుపు క్యాన్సర్లు రక్తహీనతకు కారణమవుతాయి. చర్మ మార్పులు చర్మంపై కొత్త మచ్చలు, పుట్టుమచ్చలలో మార్పులు లేదా చర్మం రంగు మారడం వంటివి క్యాన్సర్ యొక్క లక్షణాలు కావచ్చు. %ూశీషవతీవస దీఎ% గాయాలు మానకపోవడం శరీరంపై ఏర్పడిన గాయాలు చాలా కాలం పాటు మానకపోతే అది క్యాన్సర్ సంకేతంగా పరిగణించబడుతుంది.

# మార్కెట్

## టారిఫ్‌ల ప్రభావం స్వల్పమే

### ఎస్బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

హైదరాబాద్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌పై రోజుకొక బాంబు పేలుస్తుండటంపై బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి స్పందించారు. ఈ ప్రతీకార సుంకాల విధించడం వల్ల భారత్‌పై స్వల్ప ప్రభావం మాత్రమే చూపనున్నదన్నారు. హైదరాబాద్‌లో బ్యాంక్ అనుబంధ సంస్థ ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ శాఖను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..టెక్స్‌టైల్స్, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, సముద్రపు ఉత్పత్తులపై ప్రభావం చూపనున్నప్పటికీ మిగతా రంగాలపై పెద్దగా చూపదన్నారు. టారిఫ్‌లపై రెగ్యులేటరీలతో కలిసి పనిచేస్తున్నట్టు, త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ట్రంఫ్ టారిఫ్‌లతో ఒక భారతేకాదు ఇతర దేశాలు కూడా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. మరోవైపు, గ్రూపునకు చెందిన ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఐపీవోకి వచ్చే అవకాశాలున్నాయని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో భవిష్యత్తులో 30 బీమా శాఖలను నెలకొల్పబోతున్నట్టు ఆయన ప్రకటించారు. వీటిలో తెలంగాణలో 15, ఏపీల్లో మరో 15 శాఖలను ప్రారంభించనున్నది. ఇరు రాష్ర్టాల్లో చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోలేదని, వారికి అన్ని రకాలుగా సేవలు అందించాలనే ఉద్దేశంతో 2,100 హాస్పిటల్స్‌తో జట్టుకట్టినట్టు చెప్పారు. దీంతో రోగులకు అరగంటలో నగదు రహిత సేవలు అందించడానికి వీలు పడుతుందన్నారు.



## కారుకు ఆ పేపర్స్ లేకుండా టోల్ గేట్ దాటితే ఆటోమేటిక్‌గా భారీ పెనాల్టీ..!!



దేశంలో రోజురోజుకూ వాహనచట్టాలను ఉల్లంఘిస్తున్న వ్యక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ప్రజలను ప్రభుత్వాలు ఎన్నిసార్లు దీనిపై అప్రమత్తం చేసినప్పటికీ వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావటం లేదు. ఇన్సూరెన్స్ విషయంలో అప్రమత్తంగా ఉండని పరిస్థితిపై ఆందోళనలు పెరుగుతూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళితే దేశంలో తొలిసారిగా ఒడిశా ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ పేపర్లు లేని వాహనదారులకు ఈపెనాల్టీలు అందించటానికి నిర్ణయించింది. దీనికోసం టోల్ ప్లాజాల వద్ద ఈ-డిటెక్షన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. మ్మొదటిసారి తప్పుచేసిన వ్యక్తులకు రూ.2,000 పెనాల్టీ విధించాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే 3 నెలల వరకు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉన్నట్లు వెల్లడైంది. "బెంగళూరులో వణికిపోతున్న తెలుగు టెక్కీలు..! కొత్త రచ్చతో నిద్ర పట్టట్లే.. " ఒకసారి కంటే సార్లు ఇలా దొరికిన వాహనదారులపై రూ.4,000 పెనాల్టీ విధించనున్నట్లు వెల్లడించారు. 1988 మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం ప్రజా రహదారులపై నడిచే ప్రతి మోటారు వాహనానికి చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉండాల్సి ఉంది. వాస్తవానికి అనేక ప్రైవేట్, కమర్షియల్ వాహనాలు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ లేకుండా రోడ్లపై నడుస్తున్నాయి. దీని వల్ల రోడ్డు ప్రమాదాల బాధితులకు పరిహారం నిరాకరించబడుతుందని ఒడిశా ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. అయితే కొత్త వ్యవస్థతో చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ లేని వారు ఏదైనా సంఘటన జరగడానికి ముందే ప్రతిదీ పొందేలా ఒడిశా ప్రభుత్వం నిర్ధారిస్తుంది. వాస్తవానికి ఈడిటెక్షన్ వ్యవస్థను బిహార్ రాష్ట్రంలోని 32 టోల్ ప్లాజాల్లో ఇలాంటి వ్యవస్థను ఉంచింది. దీని ద్వారా పొల్యూషన్ సర్టిఫికెట్లు లేని వాహనాలను గుర్తించటానికి వినియోగిస్తున్నారు. పొల్యూషన్ సర్టిఫికెట్ లేదని గుర్తించిన వాహనాలకు రూ.10 వేలు పెనాల్టీ విధించబడుతోంది. ఈ వ్యవస్థలను ట్రయల్స్ కోసం ప్రవేశపెట్టినప్పుడు కేవలం 2 రోజుల్లోనే 5,000కి పైగా ఈ-చలాన్లు జారీ చేయబడినట్లు బీహార్ నివేదించింది. రానున్న రోజుల్లో ఈ వ్యవస్థను బీహార్ పాట్నా, ముజఫర్‌పూర్, భాగల్పూర్ సహా ఇతర స్మార్ట్ సిటీలకు విస్తరిస్తామని పేర్కొంది. దీనిని భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి వ్యవస్థను వాహన చట్టాలను ఉల్లంఘించే వాహనదారులపై ప్రయోగించనున్నట్లు తెలుస్తోంది.

## ఎల్ఐసి కస్టమర్లు జాగ్రత్త.. ఈ మొబైల్ యాప్ మీ డబ్బును మింగేస్తుంది,

టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందుతుందో ఆర్థిక మోసాలు కూడా అదే రీతిలో పెరిగాయి. వీటి వల్ల ఎక్కువగా మోసపోయేది కూడా సామాన్యులే. ప్రస్తుతం నేటి ప్రపంచంలో ఎన్నో రకాల మోసాలు ఎక్కడో ఓ చోట జరుగునే ఉన్నాయి, దీనివల్ల ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బు రెండు నిమిషాల్లో మాయమవుతుంది. తాజాగా దినికి సంబంధించి ఎల్ఐసి కూడా మోసపూరితమైన యాప్‌ల గురించి ప్రజలను హెచ్చరించింది. ఎల్ఐసి జారీ చేసిన నోటీసు ఇండియా యాప్ అని చూపించే ఫేక్ యాప్‌ను మీరు ఉపయోగిస్తే లేదా చుసిన తమకు సమాచారం అందజేయాలని %ూ×జ% ఇటీవల నోటీసు జారీ చేసింది, ఎల్ఐసి పేరుతో కనిపించే ఇలాంటి యాప్ నిజం కాదు. దీని వల్ల మీ డబ్బును కోల్పోయే అవకాశం ఉంది. ఈ కారణంగా ఇలాంటి మొబైల్ యాప్‌ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నాము. దీనితో పాటు మీ అన్ని ట్రాన్సక్షన్ అఫీషియల్ వెబ్‌సైట్ సహాయంతో మాత్రమే చేయాలని లేదా డబ్బును డిజిటల్ యాప్ ద్వారా ట్రాన్సక్షన్ చేయాలని కూడా తెలియజేసింది. " ఎల్ఐసి గతంలో కూడా నోటీసు జారీ గత ఏడాది సెప్టెంబర్‌లో కూడా ఒక నోటీసు జారీ చేసింది.

## రెండు నగరాలకు బ్లాక్‌రాక్.. హైరింగ్ 1200, హైదరాబాదీలు గెట్ రెడీ..

అమెరికాలో కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రాకతో ప్రస్తుతం జాబ్ మార్కెట్లో అనేక మార్పులు రాబోతున్నాయి. అనేక కంపెనీలు తమకు అవసరమైన నిపుణులను నేరుగా రిక్రూట్ చేసుకునేందుకు హెచ్1బి వీసాల పరిమితి ప్రభావాలు ఉన్నందున కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నాయి. ఈ క్రమంలో చాలా సంస్థలు తమ అవసరాలను తీర్చుకునేందుకు ఇతర దేశాల్లో ఆఫీసుల విస్తరణ ప్రణాళికతో ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికాకు చెందిన ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ బ్లాక్‌రాక్ తన వ్యాపారాన్ని ఇండియా కేంద్రంగా విస్తరించాలని ప్లాన్ చేస్తోంది. ఇందులో భాగంగా ఏఐ సామర్థ్యాలను భారతదేశంలో విస్తరించాలని ప్లాన్ చేసింది. ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజర్ ఇందులో భాగంగా ముంబై, న్యూఢిల్లీకి సమీపంలోని గురుగ్రామ్‌లలో తన %ఋఎబఎ% కేంద్రాల కోసం నియామకాలు చేపడుతోంది. ప్రస్తుత నియామకాలతో కంపెనీ భారతీయ ఉద్యోగుల సంఖ్య 3,500కి పెరుగుతుందని వెల్లడైంది. ప్రస్తుతం కంపెనీ విస్తరణ కారణంగా ఎక్కువ మంది డేటా సాంకేతిక నిపుణులు, ఇంజనీర్లు కలిగి ఉంటారని వెల్లడైంది. ఇదే క్రమంలో కంపెనీ బెంగళూరు ఐటీ హబ్ లో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ కేపబిలిటీస్ సెంటర్ కోసం కూడా ఉద్యోగుల నియామకాన్ని కొనసాగిస్తోంది. బెంగళూరులో దాదాపు 1500 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి రాయిటర్స్ నివేదికపై ఇప్పటి వరకు బ్లాక్‌రాక్ నేరుగా స్పందించలేదు.

# ఆంధ్రప్రదేశ్

## టిడిపి మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన

### మహానాడులో పాల్గొన్న ఆరు లక్షల మంది

అమరావతి,మే27 : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు రికార్డు స్థాయిలో స్పందన లభించింది. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన ఈ మహానాడులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లస్టర్లతో పాటు తెలంగాణ, అండమాన్, ఇతర దేశాల నుంచి కూడా పెద్ద ఎత్తున కార్యకర్తలు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. మొత్తం ఆరు లక్షల మంది కార్యకర్తలు మహానాడులో పాల్గొన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 1875 క్లస్టర్ల ద్వారా కార్యకర్తలు తమ ఐడీ కార్డులతో హాజరు నమోదు చేసుకున్నారని తెలిపారు. రామ్మోహన్ నాయుడు ఈ ప్రకటన చేయగానే మహానాడులో పాల్గొన్న నేతలు, కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. ఒక ప్రాంతీయ పార్టీ హైబ్రిడ్ మోడ్‌లో మహానాడు నిర్వహించడం, లక్షలాది మంది వర్చువల్‌గా పాల్గొనడం రికార్డు అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## మహిళలకు టిడిపి పెద్దపీట

### పార్టీ పరంగా 33 శాతం రిజర్వేషన్లకు శ్రీకారం

### తీర్మానం ప్రతిపాదించిన వర్కింగ్ ప్రసిడెంట్ లోకేశ్

అమరావతి,మే27 : మహానాడు వేదికగా టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ సంచలన ప్రతిపాదన చేశారు. పార్టీ పరంగా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిపాదిస్తూ కీలక చర్చకు శ్రీకారం చుట్టారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదన రాష్ట్ర రాజకీయాల్లోనే కాక జాతీయస్థాయిలో కూడా ఆసక్తికర చర్చకు దారితీసింది. 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని టీడీపీ తీసుకున్న నిర్ణయానికి ఈ ప్రతిపాదన మరింత ప్రాధాన్యాన్ని తీసుకువచ్చింది. మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం, నిర్ణయాత్మక స్థానాల్లో వారికి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ నిర్ణయం ఉందని నాయకులు చెబుతున్నారు. మహిళా రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే అంశంతో సంబంధం లేకుండా పార్టీ అంతర్గత వ్యవస్థలోనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని లోకేశ్ ప్రతిపాదించడం విశేషంగా మారింది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా లోకేశ్ ప్రస్తావించారు. టీడీపీ భవిష్యత్తు కార్యాచరణలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మహానాడు వేదికగా వచ్చిన ఈ ప్రతిపాదనపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ కొనసాగుతోంది.

## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

### పార్టీ జెండా అవిష్కరించిన సిఎం చంద్రబాబు

### పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి

### హాజరైన పార్టీ ప్రముఖులు, పొలిట్ బ్యూరో సభ్యులు

అమరావతి,మే27 : తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ఉలినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరుగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

## కడప జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ బోల్తా

### కడప-రాయచోటి రహదారిపై రాకపోకలకు అంతరాయం

కడప,మే27 : కడప జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడింది. ఈ ప్రమాదం కారణంగా రాయచోటి - కడప ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గువ్వల చెరువు ఘాట్‌లోని ఐదో మలుపు వద్ద ఎల్‌పీజీ గ్యాస్ ట్యాంకర్ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో రాయచోటి కడప మార్గంలో వాహనాల రాకపోకలను పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమై ట్రాఫిక్‌ను మళ్లించారు. రాయచోటి నుంచి వెళ్లే వాహనాలను చక్రాయపేట మార్గం మీదుగా దారి మళ్లిస్తున్నారు. ఘటనాస్థలిలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బోల్తాపడిన గ్యాస్ ట్యాంకర్‌ను తొలగించేందుకు ఉదయం నుంచే సహాయక చర్యలు కొనసాగాయి. మూడు భారీ క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను పైకి లేపే ప్రయత్నాలు చేశారు. అయితే ఈ ప్రక్రియలో మరో ప్రమాదం చోటుచేసుకుంది. ట్యాంకర్‌ను పైకి లేపే సమయంలో మూడు క్రేన్లు కూడా ఒక్కసారిగా నేలకొరిగాయి. దీంతో సహాయక సిబ్బంది మరింత అప్రమత్తమయ్యారు.

## మోడీ 12 ఏళ్ల పాలనపై పెద్ద ఎత్తున ప్రచారం

### జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాలు

### మోడీ నాయకత్వంలో ఆర్థికంగా బలపడ్డ భారత్

### జగన్ జనంలో లేకపోవడమే పెద్ద శాపం

### మీడియా సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్




విజయవాడ,మే27 : ప్రధాని నరేంద్ర మోదీ దేశ పగ్గాలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడిందని, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, భీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలిగిందన్నారు. జూన్ 5 నుంచి 21 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా మోదీ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. జూన్ 8 నుంచి 14 వరకు కేంద్ర నిధులతో నిర్మాణం అవుతున్న ప్రాజెక్టులను సందర్శిస్తామని, జూన్ 12 నుంచి 14 వరకు మీడియా సమావేశాల ద్వారా మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలు, సేంద్రీయ వ్యవసాయం ప్రాముఖ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, గ్రీన్ కారిడార్లు, రైల్వే అభివృద్ధి పనుల వల్ల ఉద్యోగ అవకాశాలు పెరిగాయని మంత్రి పేర్కొన్నారు. దేశ జీడీపీ గణనీయంగా పెరిగిందని, భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నాలుగో స్థానానికి చేరుకుందని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేస్తామని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత్‌కు, ప్రధాని మోదీకి గౌరవం పెరిగిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇకపోతే జనంలో లేకపోవడమే జగన్‌కున్న అసలు సమస్య అని, ఏపీ వ్యాప్తంగా నిరసనలకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపునివ్వడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసలు జగన్ ఈ నిరసనలు ఎందుకు చేస్తున్నారో ఆయనకైనా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి హామీలనూ అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నారని, అలా మాట్లాడే ముందు ఆయన క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన సత్యకుమార్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.ఇందులో భాగంగానే ప్రతి నెలా ఒకటో తారీఖునే లబ్దిదారులకు సామాజిక పింఛన్లు ఇస్తున్నామని, ఇందుకోసం నెలకు దాదాపు 33 వేల కోట్ల రూపాయలను నేరుగా అందిస్తున్నామని తెలిపారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' కింద కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నిధులతో కలిపి రాష్ట్రంలోని రైతులకు నిబంధనల ప్రకారం రూ.20,000లను వారి అకౌంట్లలో జమ చేయడం జరిగిందన్నారు. దీంతో పాటూ 'తల్లికి వందనం' కార్యక్రమం ద్వారా ఏడాదికి పదివేల కోట్ల రూపాయలు లబ్దిదారుల ఖాతాల్లోకి వెళ్తున్నాయని వివరించారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు పథకం ద్వారా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరూ రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ప్రయాణాలు సాగిస్తున్నారని గుర్తుచేశారు. గతంలో కూడా జగన్ ఒక కోటరీని ఏర్పాటు చేసుకొని, కేవలం వాళ్లు చెప్పిన విషయాలనే వింటూ 'క్లౌడ్ నైన్' లో తిరిగేవారని.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉన్నట్టు తనకు అనిపిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. 'పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది' అన్న చందంగా జగన్ వైఖరి ఉందన్న సత్యకుమార్.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినప్పుడు ఎటువంటి అరాచకాలు జరిగాయో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే రాష్ట్ర ప్రజలు మీ అరాచకాలను చూసి కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని గుర్తుచేశారు. ఇక ఎన్నికల సంఘం చేపట్టే 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ గురించి జగన్‌కు కనీస అవగాహన ఉందో లేదో తెలియదని మంత్రి వ్యాఖ్యానించారు. ఇది రాజ్యాంగబద్ధంగా ఎప్పటికప్పుడు జరిగే పక్రియ అని, ఓటర్లు ఎవరికీ అన్యాయం జరగకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చేలా చేసేందుకే ఈ సవరణలు ఉంటాయన్నారు. ఎవరైనా ఓటు మార్చుకోవాలన్నా, డూప్లికేషన్ లేదా దొంగ ఓట్లను తొలగించాలన్నా ఈ పక్రియ ద్వారానే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ బాధ్యతాయుతమైన పక్రియలను పక్కనబెట్టి, అసలు ఆంధ్రప్రదేశ్‌ను పశ్చిమ బెంగాల్‌తో జగన్ ఎందుకు పోలుస్తున్నారో ఆయనకే తెలియాలని మంత్రి సత్యకుమార్ ప్రశ్నించారు.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు

### మహిళాభివృద్ధిలో ఇదో చారిత్రాత్మక నిర్ణయం

### ఉండి మహానాడులో రఘురామ ప్రకటన


భీమవరం,మే27 : మహానాడు వేడుక వేదికగా రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇస్తామని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ ప్రకటించటం చరిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తెలిపారు. దీంతో దేశంలో అందరికన్నా ముందుగా మహిళలకు అత్యంత గౌరవం ఇచ్చే పార్టీగా ఈ నిర్ణయంతో టీడీపీ గుర్తించబడిందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించిన నారా లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు అద్భుతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో నిర్వహించిన మహానాడులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. రఘురామకు షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు అంటూ జడ శ్రవణ్ కుమార్ పచ్చి అబద్దాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అతడు ఎన్ని అబద్దాలు ఆడాడో సుప్రీంకోర్టులో రికార్డ్ చేయడం జరిగిందని.. వాటిని చూపిస్తానని చెప్పారు. వాటిని చూసి అతడికి విజ్ఞులైన ప్రజలు బుద్ధి చెప్పాలని సూచించారు. ఆకివీడులో ఆలయ నిర్మాణానికి ఒక్కరోజు కూడా ఆలస్యం జరగదని ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు తీర్పు మనకు అనుకూలంగా వస్తుందన్నారు. అందులో ఎటువంటి సందేహము లేదని చెప్పారు. నుకున్న సమయానికి రామాలయాన్ని పూర్తి చేస్తామని శ్రీరామభక్తులకు తెలియజేస్తున్నానన్నారు. తెలుగువీర లేవరా అనే ఫోరంను స్థాపించామని వివరించారు. దీనికి చాలా చక్కటి స్పందన వస్తుందన్నారు. అలాగే తెలుగువీర లేవరా వెబ్‌సైట్ కూడా ఒకటి రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఓట్ల రాజకీయం కోసం మనకెందుకులే అని వదిలేస్తున్న అంశాలను తీసుకుని న్యాయం చేయడమే ఈ తెలుగు వీర లేవరా ఫారం ముఖ్య ఉద్దేశమని ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ వివరించారు. తాను ప్రాతినిధ్యం వహించే ఉండి నియోజకవర్గంలో అన్ని ప్రార్ధన మందిరాలలో లౌడ్ స్పీకర్లు సమూలంగా నిర్మూలించామని చెప్పారు. ప్రజలకు లౌడ్ స్పీకర్ల వల్ల ఇబ్బంది ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోకుంటే.. వారిపై తాము చర్యలు తీసుకుంటామని ప్రజలకు రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. ఈ శబ్ద కాలుష్య అంశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. పవన్ కళ్యాణ్ సర్జరీ అయిన తర్వాత రెట్టింపు ప్రోత్సాహంతో పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ ఆయన స్పందిస్తున్న తీరు అత్యంత ప్రశంసనీయమని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు సంతోషం వ్యక్తం చేశారు.

## వేటకొడవళ్ల నుంచి గొడ్డళ్ల వరకు వైసిపి ప్రస్థానం

### ఐటి నుంచి క్వాంటం వరకు మారడం మన విధానం

### బోత్ ఆర్ నాట్ సేమ్. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్

### మహానాడులో చంద్రాబు ఉద్వేగ ప్రసంగం



అమరావతి,మే27 : మహానాడు వేదికగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఘాటు విమర్శలు చేశారు. 'వేట కొడవళ్ల నుంచి గొడ్డళ్లకు మారడం వైసీపీ విధానం... ఐటీ నుంచి క్వాంటం వరకు మారడం మన విధానం... బోత్ ఆర్ నాట్ సేమ్. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అంటూ వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లు రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితులే 'క్రూయల్ మెంటాలిటీ'కి ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఏపీ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ క్లీన్ చేశామని... డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ చేస్తున్నామని తెలిపారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని, ఆస్తుల భద్రత కోసం ప్రతి ఒక్కరికీ క్యూ ఆర్ కోడ్‌తో బ్లాక్‌చైన్ టెక్నాలజీ అమలు చేస్తున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ పరిణామాలు కూడా రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్‌లో యుద్ధం జరిగిందని... ఏపీలో గ్యాస్ సమస్య వచ్చిందని ప్రస్తావించారు. ఆక్వా, అరటికి రేట్లు పడిపోయాయని చెప్పారు. సంక్షేమాన్ని అవకాశంగా మార్చి ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తున్నామని వివరించారు. యువతకు కావాల్సింది గొడ్డలి వేటు కాదని... ఉద్యోగాలని సీఎం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజకీయ పార్టీ ముసుగులో 'గొడ్డలి పార్టీ' వచ్చిందని విమర్శించారు. 'ఐటీ నుంచి క్వాంటంకు మారడం మన నినాదం' అంటూ టెక్నాలజీ ఆధారిత అభివృద్ధిపైనే తమ దృష్టి అని తెలిపారు. పార్టీ కేడర్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులకు సూచించారు. కేడర్‌ను గౌరవంగా చూసుకోవాలని... ఏ నాయకుడైనా కేడర్‌ను ఇగ్నోర్ చేయడానికి వీల్లేదని హెచ్చరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో ఉండే ప్రతి కార్యకర్త నాయకుడే... తయారు చేయాల్సింది అనుచరులను కాదు, నాయకులను అంటూ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి సంజీవని ఇచ్చాం... మైహెల్త్ యాప్ తీసుకొచ్చామని తెలిపారు. ప్రతి కార్యకర్త ఆరోగ్యాన్ని పార్టీ మానిటర్ చేస్తుందని అన్నారు. పార్టీ అధినేతగా కార్యకర్తల కుటుంబ సభ్యుల సర్వతోముఖాభివృద్ధికి కూడా తనదే బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గెలుపే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 'నాయకులను గౌరవిస్తాం... కానీ మీ పరిధిలో గెలవకపోతే మీకో దండం పెడతాం' అంటూ హెచ్చరించారు. మిత్రపక్షాలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. 'ఇగోలకు పోవద్దు... అహంకారం తగదు. మన కార్యకర్తకు ఇచ్చే గౌరవమే మనకు శ్రీరామరక్ష' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.


## మాజీ సిం విజయన్ ఇంటివద్ద ఉద్రిక్తత

### ఇడి అధికారుల కారుపై రాళ్లదాడి

### దాడిలో ధ్వంసం అయిన కారు అద్దాలు

### అధికారులకు తృటిలో తప్పిన ప్రమాదం

తివనంతపురం : కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ ఇంటి వద్ద ఉద్రిక్తత నెలకొంది. మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఆయన నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు చేపట్టారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకించిన పినరయి మద్దతుదారులు.. ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. వారి కారు అద్దాలు ధ్వంసం చేశారు. పోలీసులు, కేంద్ర బలగాలు నిలువరించే ప్రయత్నం చేసినప్పటికీ వారు వెనక్కి తగ్గకపోవడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడి సమయంలో వాహనంలో మహిళా అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆందోళనకారులను సీపీఎం కార్యకర్తలుగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనను ఈడీ తీవ్రంగా పరిగణించింది. ఆందోళనకారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరువనంతపురంలోని థంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలావుంటే కేరళం మాజీ సీఎం పినరయి విజయ్ నివాసంలో ఈడి రెయిడ్స్‌ను వ్యతిరేకిస్తూ ఆయన మద్దతుదారులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. బుధవారం తిరువనంతపురంలో సోదాల అనంతరం తిరిగి వెళుతున్న ఈడీ అధికారుల వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు రాళ్లతో వాహనంపై దాడి చేయడంతో కారు అద్దాలు దెబ్బతిన్నాయి. ఈడీ రాక నేపథ్యంలో పినరయి విజయన్ నివాసానికి ఆయన మద్దతుదారులు భారీగా చేరుకోవడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. ఈడీ అధికారుల వాహనాన్ని అక్కడి నుంచి పంపించేశారు. కేంద్ర ప్రభుత్వం కావాలని ఈడి దాడులు నిర్వహిస్తోందని సీపీఎం నేతలు ఆరోపించారు. కొచ్చిన్ మినరల్స్ అండ్ రిటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) కేసులో మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళంలోని 10 ప్రాంగణాల్లో ఈడి సోదాలు నిర్వహిస్తోంది. తిరువనంతపురంలోని మాజీ సీఎం విజయన్ ప్రస్తుత నివాసంతో పాటు ఆయన స్వస్థలమైన కన్నూర్‌లోని మరో ప్రాంగణం, మాజీ సీఎం విజయన్ అల్లుడు, మాజీ మంత్రి మొహమ్మద్ రియాజ్‌కు చెందిన నివాసంలో (కోజికోడ్) కూడా ఈడీ రెయిడ్స్ నిర్వహించింది. సోదాల సమయంలో మాజీ సీఎం, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండగా బయట మద్దతుదారులు నిరసనలకు తెరతీశారు. సెక్యూరిటీ సిబ్బందిపై కొందరు దాడికి దిగే ప్రయత్నం చేయడంతో పార్టీ సీనియర్ నేతలు వారిని అడ్డుకుని శాంతింపజేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాజీ సీఎం విజయన్ కూతురు వీణా విజయన్‌కు చెందిన ఐటీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ నుంచి ఎలాంటి సేవలు పొందకుండానే సీఎంఆర్ఎల్ డబ్బులు చెల్లించిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ ఈ రెయిడ్స్ నిర్వహించింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కూడా రంగంలోకి దిగింది. మొత్తం రూ.2.7 కోట్లు సీఎంఆర్ఎల్ నుంచి ఎక్సాలాజిక్‌కు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఐటీ సర్వీసులు, కన్సల్టెన్సీ సేవల మాటున ఈ చెల్లింపులు సాగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈడీ కేసును కొట్టేయాలంటూ సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కేరళ హైకోర్టు ఇటీవలే తోసిపుచ్చింది. మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ సీఎం విజయన్ గతంలోనే కొట్టిపారేశారు. తమ ఇమేజీని దెబ్బతీసే లక్ష్యంగా ఈ ఆరోపణలు పుట్టుకొచ్చాయని చెప్పారు.



## కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే

కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ 'సెయాన్'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'అమరన్' విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. 'ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.





## సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం 'సమ్మర్ హాలీడేస్'. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.




### మా ఊరి వాతావరణమే
## ఎల్లమ్మకు చేరువ చేసింది

బలగం వేణు దర్శకత్వం వహిస్తున్న ఎల్లమ్మలో హీరోగా దేవిశ్రీప్రసద్ నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పార్ట్ మొదలయ్యింది. తాను కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాని చేయడానికి స్ఫూర్తినిచ్చిన విషయాల్ని ఓ వీడియోతో పంచుకున్నారు దేవిశ్రీప్రసాద్. సంగీత దర్శకుడిగా సుపరిచితమైన ఆయన కథానాయకుడిగా 'ఎల్లమ్మ' సినిమాతో తెరకు పరిచయం అవుతున్న సంగతి తెలిసిందే. వేణు ఎల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్ నిర్మిస్తున్నారు. తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల దేవిశ్రీ ప్రసాద్ తన స్వగ్రామమైన వెదురుపాకని సందర్శించి, ఆ ఊరి జాతర వేడుకల్లో భాగమయ్యారు. అందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ 'మా నాన్న జన్మించిన ఊరు వెదురుపాక. ప్రకృతి, గ్రామీణ జీవన సౌందర్యం గురించి తెలుసుకోవాలని మా నాన్న చిన్నప్పుడు మమ్మల్ని తరచూ చెన్నై నుంచి వెదురుపాక తీసుకొచ్చేవారు. మా మూలాలతో, మనుషులతో అనుబంధం కొనసాగాలని ఇక్కడే ఓ అందమైన ఇల్లు కూడా నిర్మించుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం ఎంత అందమైనవో నాకు నేర్పిన ఊరు ఇదే. ఆ అనుభూతులే నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడానికి స్ఫూర్తినిచ్చాయన్నారు.




## పెద్ది మూవీ జపాన్‌లో విడుదల లేనట్లే

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో పెద్ది సినిమాను కూడా జపాన్‌లో ఒకేసారి విడుదల చేస్తే మంచి స్పందన వస్తుందని నిర్మాతలు భావించినట్లు తెలుస్తోంది. జపాన్ అభిమానులు కూడా ఈ వార్తతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్ల జపాన్‌లో పెద్ది సేమ్ డే రిలీజ్‌ను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో జూన్ 4న సినిమా అక్కడ విడుదల కావ్లటైంది. ఈ వార్తతో జపాన్‌లోని రామ్‌చరణ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రేక్షకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక పెద్ది చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.




## ట్రోలర్స్‌ను పెద్దగా పట్టించుకోను

### పెద్ది మూవీపై జగపతిబాబు

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు. ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారని అన్నారు. అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు.



## థ్రిల్‌కి గురిచేసే త్రికాల

సనాతన ధర్మంలో దాగివున్న రహస్యాల ఆధారంగా రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ 'త్రికాల'. శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రధారి. మణి తెల్లగూటి దర్శకుడు. రాధిక, శ్రీనివాస్ నిర్మాతలు. ఈ నెల 28న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ప్రచార చిత్రాలు ఈ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయని, అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా రూపొందిందని, సంస్కృతి, ఆధ్యాత్మికత, థ్రిల్ అంశాల కలబోత ఈ సినిమా అని మేకర్స్ చెబుతున్నారు. మాస్టర్ మహేంద్రన్, అజయ్, ఆమని, సాహితి అవంచ, ప్రభాకర్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పవన్ చెన్న, సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సమర్పణ: చాగంటి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ.

## బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తున్న దృశ్యం 3..

### 150 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'దృశ్యం 3' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. మే 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ ఆదరణను సొంతం చేసుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఇప్పటికే 150 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా మరోసారి 'దృశ్యం' ఫ్రాంచైజీ శక్తిని నిరూపించింది. మొదటి రెండు భాగాలు ప్రేక్షకులపై బలమైన ముద్ర వేయడంతో మూడో భాగంపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా జార్జ్‌కుట్టి పాత్ర చుట్టూ తిరిగే ఉత్కంఠభరిత కథ, అతని కుటుంబం ఎదుర్కొనే పరిస్థితులు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. గతంలో జరిగిన సంఘటనల నుంచి తెలివిగా బయటపడిన జార్జ్‌కుట్టి ఈసారి కూడా తన కుటుంబాన్ని కాపాడగలడా? లేక చట్టం వలలో చిక్కుకుంటాడా? అనే అంశాల చుట్టూ కథ నడుస్తోంది. ఈసారి చిత్రంలో కేవలం థ్రిల్లింగ్ అంశాలే కాకుండా భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేశారు. కుటుంబ బంధాలు, భయం, బాధ, మానసిక ఒత్తిడి వంటి అంశాలను దర్శకుడు హృదయానికి హత్తుకునేలా చూపించారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతంగా దూసుకుపోతోంది. తాజాగా సినిమా విజయాన్ని పురస్కరించుకుని మేకర్స్ 'బిహైండ్ ద సీన్స్' వీడియోను విడుదల చేశారు. ఇందులో షూటింగ్ సమయంలో జరిగిన ఆసక్తికర క్షణాలు, నటీనటుల అనుభవాలు, సన్నివేశాల చిత్రీకరణ కోసం తీసుకున్న శ్రమను చూపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్‌తో పాటు మీనా, అన్సిబా హసన్, ఎస్తర్ అనిల్, ఆశా శరత్, సిద్ధిఖ్, కళాభవన్ షాజోన్, ఇర్షాద్, గణేష్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇక 'దృశ్యం 3' హిందీ వెర్షన్ కోసం కూడా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com